సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణే ధ్యేయంగా

# ప్రపత్తి శ్రీసన్నిధానం

ఆధ్యాత్మిక మాసపత్రిక

కరీంనగర్ సంపుటి: 02 సంచిక: 01 మార్చి 2025 పేజీలు: 36 వెల: 30/-



అత్యధిక పాఠక ఆదరణ పొందుతున్న ఆధ్యాత్మిక పత్రిక



# ముఖచిత్రపరిచయం

సాకేతరాముని సన్నిధిలో భగవత్ రామానుజులు నెలవైతే, శ్రీరామానుజులవారు ఎక్కడవుంటే మేము అక్కడ ఉంటామని 108 దివ్యదేశ పెరుమాళ్లు కూడా ముచ్చింతలలో కొలువైనారు. ఆళ్వారులు కీర్తించిన దివ్యదేశమూర్తులకు ఒకేసారి ఉత్సవాలు జరగడం అరుదైన దృశ్యం. సమతామూర్తి సన్నిధి వేదికగా భారతీయ కళలను ప్రతిబింబించే ఆధ్యాత్మిక ప్రదర్శనలు, ఆగమోక్త ఆరాధనలు, అలంకరించిన వేదికలు, వేదఘోషల నడుమ ఇలవైకుంఠమిదిగో! అన్న విధంగా వైభవం వీక్షించే అవకాశం కలిగింది. ఆనాడు వేనోళ్ళ పొగిడే వేయి సంవత్సరాల పండుగగా శ్రీరామానుజ సహస్రాబ్ది సమారోహం వేడుకలు లోకోత్తరంగా నిర్వహించబడ్డాయి. 1035 కుండాలతో 'హవనారాధనలతో ప్రతిష్ఠాత్మకంగా సమతామూర్తి భగవద్రామానుజులు విరాణ్మూర్తి, స్వర్ణమూర్తిగా ప్రతిష్ఠింపబడి అప్పుడే మూడు సంవత్సరాలు ముగిసాయి. అపర రామానుజులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయరు స్వామివారి సంకల్పం, పర్యవేక్షణ, కటాక్షం ఈ మూడింటి సాఫల్యతతో ఈ దివ్యక్షేత్రం వైభవంగా విరాజిల్లుతోంది.

యావత్ భారతావని గర్వించే విధంగా నెలకొన్న ఈ సమతామూర్తి క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల వేడుకల సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేస్తూ జగదాచార్యుల ముఖచిత్రం.

## సంప్రదించండి
## మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!

### వార్షిక చందా

ప్రపత్తి శ్రీసన్నిధానం, ఆధ్యాత్మిక మాసపత్రిక వార్షిక చెల్లింపు రూ.500/- (12 నెలలు పోస్టల్ చార్జితో పాటు)

సలహాలు, సూచనలు, చిరునామా మార్పులు, నూతన చందాదారులు కావడానికి సంప్రదించండి.

హెల్ప్‌డెస్క్ నెంబర్: 9502583323 (పనిదినాలలో ఉదయం 9 గం. నుండి రాత్రి 9 గం. వరకు)

help desk: prapatti.srisannidhanam9@gmail.com

### ముఖ్య గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాసపత్రిక ఈ సంచికలో ప్రచురించిన రచనలలోని భావాలు ఆయా రచయితలవే, రచన సారాంశము రచయిత అభిప్రాయముగా భావించవలెను. ఈ రచనల భావంతో సంపాదకునికి, ట్రస్ట్‌నకు ఎటువంటి బాధ్యత లేదని పాఠకులు గమనించవలసినదిగా మనవి.

– ఎడిటర్

# ప్రపత్తి శ్రీసన్నిధానం

https://srisannidhanam.org

prapatti.srisannidhanam9@gmail.com

సంపుటి: 2 - సంచిక: 1 ఎడిటర్ : డింగిరి శ్రీనివాసమూర్తి మార్చి 2025 వెల : 30


## ఇందులో


04. సంపాదకీయం
శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి
06. శ్రీరామానుజ సుధామాధురి
శ్రీమతి సముద్రాల శారద
08. శ్రీపతిస్తుతి - మంచిమాట
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు
09. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల
సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి
10. భగవద్గీత
శ్రీమాన్ శ్రీ సాతులూరి గోపాల కృష్ణమాచార్యులు
12. దాశరథి శతకము
శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు
14. భాగవతంలో భగవంతుని అవతారగాథలు
శ్రీమతి తిరుమల నీరజ
16. అఖిలహేయ ప్రత్యనీకత్వమ్
శ్రీమాన్ శ్రీ డా॥ ఈయుణ్ణి సింగరాచార్యులు
18. శ్రీ కులశేఖరాళ్వారుల వైభవము (ప్రత్యేకం)
శ్రీమాన్ శ్రీ కొమాండూరు ఇళైవిల్లి స్థలశాయి
20. జ్యోతిర్విజ్ఞానమ్
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
21. ఆవేదన - నివేదన
శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు
22. పెరియాళ్వార్
శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు
23. శ్రీరామాయణంలో ఉపకథలు
శ్రీమతి చక్రవర్తుల చూడామణి
25. జీవుడు కర్మను స్వతంత్రుడై చేస్తాడా?
శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు
26. సంప్రదాయసేవలో మనస్విని ప్రచురణలు
27. తెలుసుకోవలసినవి మూడే
శ్రీమాన్ శ్రీ వంగల వెంకటాచార్యులు
29. ఋషివాక్య ప్రబోధాలు
శ్రీమాన్ శ్రీ డా॥. యం. టి. ఆళ్వార్ స్వామి.
30. వానమామలై చరిత్ర, శ్రీమతి వనం ఉషారాణి
31. కీర్తనా మాధుర్యం
శ్రీమాన్ శ్రీ డా॥ వోలేటి రవికుమారాచార్యులు
35. బాలవిజ్ఞానం, శ్రీమతి విజయ కందాళ
36. శ్రీసన్నిధి పదకేళి, శ్రీమాన్ శ్రీ ఆచార్య శ్రీవత్స

నెలవారిపంచాంగం, పుస్తక పరిచయం, మనదేవాలయాలు, ఆధ్యాత్మిక వార్తలు



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్
డింగిరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

## సంపాదకీయం

# అర్చకునిపై దాడి – పిచుకపై బ్రహ్మాస్త్రమా?!



పిచుకపై బ్రహ్మాస్త్రం అంటే ఇదేనేమో! అర్చకునిపై దాడి అమానుషం. రామరాజ్యస్థాపనకోసం సహకరించాలని చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి. దిగ్భ్రాంతి కలిగించే సంఘటన. రామరాజ్యం అంటే... హింసకు తావులేదని అందరికీ తెలిసిందే. ధర్మాన్ని పరిరక్షించడానికే రామరాజ్యం రావాలన్నది సత్యం. ప్రజాస్వామ్యంలో ఏది జరగాలన్నా రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిందే. దానిని దౌర్జన్యంతో ఎలా చేయగలరన్నదే ప్రశ్న. దారుణం జరిగిన తర్వాత అర్చకునిపై దాడి చేసింది మేమే అంటూ ఇంటర్‌నెట్ వేదికగా వీడియోలు పోస్టుచేశారు. దీనితో ఇటు పాలకులు కదిలారు. ఆధ్యాత్మిక వేత్తలు స్పందించారు. ప్రముఖులూ పెదవివిప్పారు. ఆలయవ్యవస్థలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఒంటికాలిపై నిలబడి ధైర్యంగా పోరాడే అర్చకుడు రంగరాజన్ బేలగాచేతులు కట్టుకుని దీనంగా నిలబడిన సందర్భం. ప్రతి ఆధ్యాత్మిక వేత్తగుండెల్లో బలంగా గునపం గుచ్చిన చందంగా తయారైంది. చట్టం తనపని తాను చేసుకుంటూ వెళ్లింది. కానీ ఇంకా వివిధ చిన్నా, పెద్ద దేవాలయాలలో పనిచేస్తున్న అర్చకులలో గుబులు చోటుచేసుకుంది. అర్చకుల తీరుతెన్నులను గమనిస్తే ఆసక్తికర అంశాలు ఎన్నో ఆవిష్కృతమవుతాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలలో చాలా దేవాలయాలు ధూపదీప నైవేద్యానికి నోచుకోవడం లేదు. ఉదాహరణకు ఒక పట్టణంలో ఉన్న లెక్కకు మించి దేవాలయాలలో దీపంపెట్టేది ఒకే అర్చకుడంటే నమ్మశక్యంగా లేని మాట! కాని ఇది వాస్తవం. ఇలాంటి సందర్భాలు అక్కడక్కడా కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ మనకు కనిపిస్తున్నాయి. కానీ వాస్తవాన్ని అంగీకరించేవారు తక్కువ. ఎందుకంటే మసిపూసి మారేడుకాయ అన్న చందంగా పరిస్థితిని బయటకు రాకుండా మరుగున పడుతున్న సందర్భాలు లేకపోలేదు. ఇది అప్రస్తుతం. వాస్తవానికి వస్తే ఆలయానికి చిన్నా పెద్దా ఎవరైనా రావాల్సిందే. ఆలయానికి వచ్చిన వారు ఎవరైనా ఎంత పెద్ద పదవిలో ఉన్నా మూలమూర్తి ఆదేవదేవుని అనుగ్రహం పొందాలంటే అర్చకుని ముందు తలవంచాల్సిందే. కష్టం వచ్చినా సుఖం వచ్చినా అర్చకునికి విన్నవించి భగవంతుని కృపకు పాత్రులు కావడానికి యత్నించాల్సిందే. ఆధ్యాత్మిక వ్యవస్థలో ఆలయంలో మూలమూర్తికి భక్తునికి మధ్య ఉండేది అనుసంధానం అర్చకుడే. నిస్వార్థంగా సేవలు చేసేది అర్చకులే. కొన్ని దేవాలయాలలో పూజాది కార్యక్రమాలు నిర్వహించాలన్నా ధూపదీపనైవేద్యం కింద వచ్చిన డబ్బుతో స్వామికి ఏమి నివేదించాలి? పొట్ట ఎలా గడుపుకోవాలన్న ప్రశ్నలో అర్చకులు ఉన్నారు. వంశపారంపర్యం కింద తమకు లభించిన ఆలయాలను వదులుకోలేని అర్చకులు నిత్యం పూజాదికాలు నిర్వహిస్తున్న సందర్భాలు లేకపోలేదు. అసలు తెలుగు రాష్ట్రాలలో దేవాలయాలు ఎన్ని ఉన్నాయి? వాటి నిర్వహణ ఎలా ఉంది అని స్వచ్ఛంద సంస్థలు సర్వే చేస్తే వాస్తవాలు ఎన్నో వెలుగు చూస్తాయి. దేవాలయంలో ఎప్పుడో వెలిసిన మూలస్వామికి మహత్తు కలగాలన్నా నిత్యం ఆరాధన జరగాలని ఆగమ శాస్త్రం చెపుతోంది. అలాగని దేవాలయానికి ఆదాయం లేదని పూజాదికాలు చేయలేం అని అర్చకులు ఎవరైనా ఆందోళన చేసిన సందర్భం ఇప్పటివరకు లేదనే చెప్పాలి. తలవంచుకు బాధ్యతగా పనులు చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో అర్చకునిపై దాడి జరిగిందని తెలిసిన వెంటనే చిన్నా లేదా పెద్ద ఆలయాలలో నిత్యం పూజలు చేసే అర్చకుల గుండెల్లో రైళ్లు పరుగెట్టాయి. భయంతో నోట మాట వెళ్లని చందంగా ప్రతి గ్రామంలో, పట్టణంలో అర్చకునిపై దాడి జరిగిన ఉదంతాన్ని చర్చించుకోవడం సర్వసాధారణమైపోయింది. ముఖ్యంగా గ్రామాలలోని ఆలయాలలో వృద్ధాప్యంకు చేరువైనవారే అర్చకులుగా కనిపిస్తున్నారు. వారు కూడా భయంతో బిక్కు బిక్కు మంటున్నారు. అర్చకులు దొరకడమే కష్టంగా ఉన్న ఈరోజుల్లో ఉన్న అర్చకులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ప్రతి హిందువుపై ఉంది. సంస్కృతీ సంప్రదాయాలను, సనాతన ధర్మాన్ని కాపాడుకోడానికి ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. సనాతన ధర్మపరిరక్షకులుగా ఇప్పటివరకు అర్చకులు నిర్వహిస్తున్న బాధ్యతలకు వెలకట్టలేం. విలువలు పరిరక్షించాల్సిన వారికే రక్షణ కరువైతే ఇక చిన్న చిన్న గుడులకు దిక్కెవరు, ఇప్పటికే చాలా ఆలాయాలు పూజాదికాలకు నోచుకోక బూజుపడుతున్నాయి. వాటన్నింటిని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వాస్తవాలను వాస్తవాలుగా సత్యం నలుగురికి పంచుదాం! సనాతన ధర్మాన్ని పరిరక్షిద్దాం!!

-వొడ్డిపర్తి రామచంద్రమూర్తి

# నెలవారి పంచాంగమ్

**ఫాల్గుణమాసం 01-03-25 శుక్లపక్షంతో ప్రారంభమై 29-03-25 వరకు, 30-03-25 నుండి చైత్రమాసం**

04-03-2025 వరకు శతభిష కార్తి, 05-03-2025 నుండి 17-03-25 వరకు పూర్వాభాద్ర కార్తి, 18-03-2025 నుండి సంవత్సరాంతం ఉత్తరాభాద్ర కార్తి, **పండుగలు:** 01-03-25 యాదాద్రి లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవములు ప్రారంభం, 8న కళ్యాణోత్సవము, 09-03-25 కులశేఖరాళ్వార్ తిరునక్షత్రము, 10-03-25 సర్వేషాం ఏకాదశి, 14-02-25 హెూళీ, 25-03-25 సర్వేషాం ఏకాదశి, 29-03-25 అమావాస్య, 30-03-25 శ్రీవిశ్వావసు నామ సం॥ ఉగాది పండుగ, నూతనవత్సరాది.

## మాస ఫలాలు

**మేషం:** ఈ నెలలో పరిస్థితులు అనుకూలించవు. అధిక ధనవ్యయం, ఋణాలు కొద్దిగానైనా చేయుదురు. స్త్రీమూలకంగా విరోధములు. ప్రయాణాలందు ఇబ్బందులు, కార్యములు మధ్యలో నిలిచిపోవును.

**వృషభం:** ఈ నెల కూడా అనుకూలంగా ఉంటుంది. అనుకున్నపనులు చాలా సులువుగా పూర్తిచేయగలరు. సంతాన సౌఖ్యం, శత్రువులపై ఆధిక్యత, గతంలో ఉన్న సమస్యలు తొలగి ఉల్లాసంగా జీవిస్తారు.

**మిథునం:** ఈ నెల చేయు వృత్తి వ్యాపారాలందు లాభములు, స్థిరాస్థి వృద్ధి, ధనలాభములు, ఆరోగ్య లాభాలు, సమస్యలు మబ్బు వీడినట్లు విడిపోవును.

**కర్కాటకం:** ఈ నెల చేయు వృత్తి వ్యాపారాలందు అనుకూలత, ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక లావాదేవీలు సంతృప్తి, గృహ నిర్మాణ పనులు కలసివచ్చును.

**సింహం:** ఈ నెల పరిస్థితులు అనుకూలించవు. శారీరకశ్రమ, అకాల భోజనములు, శిరోవ్యాధులు, ఔషధసేవ, ఉద్యోగ బదిలీలు తప్పవు. విద్యార్థులకు చదువు పై శ్రద్ధ ఉండదు.

**కన్య:** ఈ నెల బాగుండును. మనఃశ్శాంతి ఉంటుంది. ఆరోగ్యలాభం. శారీరకశ్రమ. భూసంబంధ వ్యవహారాలు లాభించును. పరీక్షలు బాగా వ్రాయుదురు. గృహంలో శుభ కార్యాలు జరుగును

**తుల:** ఈ నెల చేయు వృత్తి వ్యాపారాలందు అనుకూలమే. గాని ఉద్రేకం, కోపం ఉండుటవల్ల కార్యాలు ఆలస్యమగును. దైవ సంబంధ కార్యములలో పాల్గొంటారు.

**వృశ్చికం:** ఈ నెల అన్నివిధాలుగా యోగమే. కార్యాలందు జయం, ఆరోగ్యం బాగుండును. ఆదాయం బాగుండును. ప్రతీ విషయంలో ధైర్యంగా ముందుకు పోగలరు. విద్యార్థులు పరీక్షలు బాగావ్రాయుదురు.

**ధనుస్సు:** ఈ నెల చేయు వృత్తివ్యాపారములందు అనుకూలం. ఆరోగ్యం బాగుండును. ఆర్థికంగా సంతృప్తి, ధైర్యంగా ముందుకు పోగలరు. విద్యార్థులకు అనుకూలమే.

**మకరం:** ఈ నెల ఏ పని చేయువారలకైనా లాభించును. అన్నింటామీదే పైచేయి. ఆర్థికంగా బాగుండును. ధైర్యంతో పనులు, విజయం సాధిస్తారు. విద్యార్థులు పరీక్షలు బాగా వ్రాయుదురు.

**కుంభం:** ఈ నెల చేయు వృత్తివ్యాపారములందు రాణింపు, ఆరోగ్యలాభం, ఆదాయంనకు లోటుండదు. ధనలాభము. విద్యార్థులు పరీక్షలు బాగా వ్రాయుదురు.

**మీనం:** ఈ నెల ఆరోగ్యం బాగుండదు. ఊహించని సమస్యలు ఎదుర్కొంటారు. పనులందు ఆటంకములు, ధైర్యంగా ముందుకు వెళ్ళలేరు. విద్యార్థులు పరీక్షలు బాగా వ్రాయుదురు.

## శ్రీవిశ్వావసు ఉగాది శుభాకాంక్షలు

ఉగాది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కర్ణాటక రాష్ట్రాలలో జరుపుకునే ముఖ్యమైన పండుగ. ఇది కొత్త సంవత్సరాన్ని సూచిస్తుంది. చైత్ర మాసం శుక్ల పాడ్యమి రోజున నూతనవత్సరాది. అభ్యంగనాలు, కొత్త బట్టలు ధరించడమేకాక ప్రత్యేకమైనది ఉగాది పచ్చడి. ఇది తీపి, పులుపు, కారం, చేదు రుచుల సమ్మేళనంతో తయారు చేస్తారు. ఇది జీవితంలోని వివిధ అనుభవాలను సూచిస్తుంది. ఈరోజు దేవాలయాలను సందర్శించి పంచాంగ శ్రవణంచేసి సంవత్సర ఫలితాలు తెలుసుకొంటారు. ఈ పండుగ అందరిలో ఆనందం, ఉత్సాహం మరియు కొత్త ఆశలను నింపుతుంది.

| మంచి రోజులివిగో... | మార్చి నెల శుభ ముహూర్తములు 2,3,6,9,10,11,25 |
|---|---|

# భావశుద్ధియే గొప్ప భాగ్యం



**- శ్రీమతి సముద్రాల శారద**

శుద్ధమైన భావ సంపద బాహ్యాన్ని శుద్ధి చేస్తుంది. జీవితాన్ని పరమార్థం వైపే నడిపిస్తుంది. త్రికరణ శుద్ధితో జీవించే విధానం సకల భాగ్యాలను సొంతం చేస్తుంది. పరిపాలకులైనా, పరివ్రాజకులైనా, పరిచారకులైనా భావ శుద్ధి ఉంటేనే చిత్తశుద్ధిని ఆత్మశుద్ధిని పొందగలుగుతారు. అందుకే పరమ భక్తులైన వాగ్గేయకారులు **భావములోన బాహ్యమునందును గోవిందా యని కొలువవో మనసా!** అని కీర్తిస్తారు. ఆ క్రమంలో మనకు భావమందు భగవంతుని ధ్యానిస్తేనే వాక్యమందు కీర్తించగలమని తెలుస్తోంది. భావ శుద్ధికి సాధన చేస్తేనే కరణములందు, కార్యములందు పవిత్రత సమకూరుతుంది. అందుకే ఆరాధనాదులలో ముందుగా ఋత్వికులు, అర్చకులు కూడా అంతఃకరణ శుద్ధికి ఒక ఆగమోక్త విధానాన్ని అనుసరిస్తారు.

**భగవాన్ పుండరీకాక్ష! హృద్యాగంతు మయాకృతం**
**ఆత్మ సాత్కురు దేవేశా బాహ్యే త్వాం సమ్యక్ అర్చయేత్** అని ప్రార్థిస్తారు. పుండరీకాక్షుడైన భగవంతుడా! కర్మలందు బాగుగా అర్చించుటకు నా హృదయమందు నిలిచి పవిత్రం గావించుమని. అలాగే ఏ పరిస్థితుల్లో అవస్థలో అయినా **యత్ స్మరేత్ పుండరీకాక్షం స బాహ్యాభ్యంతరఃశుచిః** అని బాహ్యములో అంతరంగంలో కూడా పవిత్రం గావించినట్టు భావిస్తారు.

అంతరంగములో శుద్ధి అనేది సర్వ కార్య సాఫల్యతకు మూలమైనది. అలాగే సక్రమంగా లేని భావ అనుగతి దోషాలకు మూలమైనది. అందుకే **మన ఏవ మనుష్యాణామ్ కారణం బంధమోక్షయోః** (మనసే బంధమోక్షములకు కారణము) అని, **బుద్ధిః కర్మానుసారిణి** (కర్మను అనుసరించి బుద్ధి ఆలోచనలు ఉంటాయి) అని కూడా ఆర్యోక్తి. కర్మవాసనల చేత సంసారిక ప్రయోజనాలు కలిగే ధర్మరహితమైన ఆలోచనా విధానం, ఆ భావాల పరిపుష్టి దోషభూయిష్టమైనదే! లౌకిక జీవితానికి కూడా అది సాఫల్యతను చేకూర్చదు.

ఎంతటి దోషాలనైనా హరింప చేసేది ఆచార్య ఆశ్రయణం మాత్రమే అని సంప్రదాయం తెలుపుతుంది. ఆచార్య ఉపదేశం ఏ వర్ణంలో, ఏ వయసులో ఉన్నవారినైనా మంచి భావాలు గలవారిగా చేసి,మంచి ఆచరణల వైపు ప్రేరేపిస్తుంది. అటువంటి గొప్ప మార్గాన్ని 'రామానుజమార్గం' దర్శింప చేస్తుంది. అందుకే అందరికీ ఉత్తారకాచార్యులు భగవద్రామానుజులు మాత్రమేనని ఏనాటి నుండో విశ్వసింపబడుతున్నది.

తేజః పుంజము వంటి జగదాచార్యుల కీర్తి కిరణాలను దర్శించాలంటే వారి వైభవాన్ని వెల్లడించిన వారి శిష్యుల చరిత్రలను తెలుసుకోవలసిందే!

**యస్యాపరాధాన్ స్వపథ ప్రపన్నాన్ స్వకీయ కారుణ్య గుణేన పాతి** అని అపార కరుణ చేత వారి చక్కని గుణాల చేత శిష్యుల రక్షకత్వాన్ని వహిస్తారట! భగవద్రామానుజుల నామస్మరణతో దోషాలు హరిస్తాయి.

జగదాచార్యుల ప్రధాన శిష్యులు కూరేశులు. వీరు అపారమేధో సంపత్తి,ఆచార్య నిష్ఠ కలవారు.వేద శాస్త్ర పారంగతులు. వారి కీర్తికి ఆకర్షితులై ఎందరో శిష్యులు వారిని ఆశ్రయించారు. వారి శిష్యులకు కూడా ఉత్తారకాచార్యులు భగవద్రామానుజులే! కూరేశులను **యతీశ వాక్సుధాఝురీ సదానుభూతి మత్తధీః** (యతి రాజులైన భగవత్ రామానుజుల శ్రీసూక్తులనే అమృత ప్రవాహాన్ని ఎల్లప్పుడూ అనుభవించడం వల్ల ఆధిక్యత పొందిన బుద్ధిగల వారు) అని స్తుతిస్తారు. అటువంటి వారికి **పిళ్లై పిళ్లై యాళ్వాన్** (పుత్రపుత్రార్యులు) అను ఐశ్వర్య,విద్య అభిజాత్యంగల శిష్యులు ఉండేవారు. పరమ వైష్ణవులకు ఆకించన్యమే స్వభావమై ఉండాలి. భావశుద్ధి లేక భాగవతోత్తముల యందు "అపవాద భాషణం" చేయడం అపచారం. కనుక

# శ్రీరామానుజ సుధామాధురి



అలవాటుగా ఇతరుల యందు ఎప్పుడు తప్పులు పట్టే స్వభావం కల పుత్రపుత్రార్యులను సంస్కరించాలని కూరేశులు భావించారు. ఒక శుభ తిథినాడు వారిని పిలిచి "త్రికరణశుద్ధిగా ఏ భాగవతులు ఎడల మీరు అపవాదు మాటలతో అపచార పడరాదు ఇదే గురుదక్షిణ" అని వాగ్దానం చేయమని ఆజ్ఞాపించారు. అపార భక్తి గల శిష్యుడు కనుక "నా పరమావధి మీరే కనుక తప్పక ఆచరిస్తానని" మాట ఇచ్చారు. ఇలా కొంతకాలం గడిచాక ఒకరోజు పూర్వ సంస్కార ప్రభావం చేత వారు భాగవదపచారం చేశారు. వీధి అరుగుపై కూర్చుని రోగగ్రస్తుడై అనాచారంతో ఉన్న శ్రీ వైష్ణవుని చూచి దోషాన్ని మనసులో భావించారు వెంటనే పశ్చాత్తాప పడి గురువుకి ఇచ్చిన మాట తప్పానని నిరాహారంతో ప్రాణ త్యాగం చేయడానికి ఉపక్రమించారు. గురువైన కూరేశులు అతనిని ఊరడించి పశ్చాత్తాపానికి పరిష్కారం చెప్పారు.

**పరోపవాదోం భవతా**
**మనసా చింతితోం యది।**
**భక్త్యా సంస్మర పాదాబ్జం**
**యతీంద్రస్య జగద్గురోః॥**

"పరోపవాద చింతన ఎప్పుడైతే వస్తుందో వెంటనే భగవద్రామానుజ పాదాబ్జస్మరణ భక్తితో చేసుకో హృదయం పవిత్రం అవుతుంది" అని బోధించారు. ఇంతవరకు చేసిన అపచారాలకు ప్రాయశ్చిత్తం కూడా 'రామానుజ' స్మరణయే!

**ప్రాయశ్చిత్తం యతీంద్రస్య పాదాబ్జ స్మరణం ధ్రువం**

అపచార ప్రాయశ్చిత్తానికి కూడా యతిపతి పాద పద్మములనే స్మరించాలి. అని తెలిపారు. అందుకే పరిపూర్ణమైన వైష్ణవులు "రామానుజ దాసన్" అని "సర్వాపరాధిని " అని పలకరింపు వచనాల్లో అనేక సంప్రదాయ (రహస్యాలు) తెలిపే పదాలను ఉపయోగిస్తారు.

**ప్రమాదాత్తు యది ప్రాప్తం**
**యత్పాపం మనసా2ధ్యదత్।**
**వినశ్యత్యాశు యోగీంద్ర**
**పాదాబ్జ స్మరణాత్ ధ్రువం॥**

ప్రమాదవశాత్తు అపరాధం చేస్తే కూడా అది నశించే కొరకు యతీంద్రుల పాదాబ్జ స్మరణమే నిశ్చయము. అందుకే భావ శుద్ధి కలిగి ఉండటమే భాగ్యము. గనుక భావ శుద్ధి గల భగవద్రామానుజుల శిష్యులైనవారి చరిత్రను స్మరిస్తే మనము కూడా ధన్యులమే!

అలవాటుగా, పొరపాటుగా కూడా భాగవత అపవాదు చేయకుండా ఉండాలంటే ఏమి చేయవచ్చో అలాంటి సూచనలు కూడా మహనీయుల చరితల్లోనే చూడవచ్చు. జగదాచార్యులంటే ఎంతో అభిమానం గల శిష్యులు సోమాశి యాండాన్ అనువారి చరిత్రలో వారితో జరిగిన సంభాషణల ద్వారా తెలుపబడుతుంది. భాగవతావచారం (అపవాద భాషణం) పొరపాటున కూడా చేయకుండా ఉండాలంటే హెచ్చరికగా ధరించిన వస్త్రానికి ఒక ముడి వేసి ఉంచుకోవాలి. అది మన ధర్మాన్ని గుర్తు చేస్తుంది. అని ఒక సన్నివేశంలో వీరి చరిత్రలో చెప్పబడింది.

# శ్రీపతి స్తుతి - సుభాషితం

## మంచి మాట

3వ అవతార స్తుతి. **విభవావతారము** లకు సంబంధించి.


**శ్లో॥ వేదాన్వేషణ మందరాద్రి భరణ, క్ష్మోద్ధారణ, ప్రశ్రిత**
**ప్రహ్లాదావన, భూమి భిక్షణ, జగద్విక్రాంతయో యత్క్రియాః।**
**దుష్టక్షత్ర నిబర్హణం, దశముఖాద్యున్మూలనం, కర్షణం**
**కాళింద్యాః, అతిపాప కంస నిధనం యత్క్రీడితం తం నమః॥**

ప్రతి పదార్థము:-

వేదాన్వేషణ = వేదములను వెదకుట, మందరాద్రి భరణ = మందర పర్వతమును భరించుట, క్ష్మోద్ధారణ = భూమిని ఉద్ధరించుట, ప్రశ్రిత = ఆశ్రయించిన, ప్రహ్లాదావన = ప్రహ్లాదుని రక్షించుట, భూమి భిక్షణ = భూమిని యాచించి, జగద్విక్రాంత = జగత్తులను ఆక్రమించుట, యోయత్క్రియాః = ఏ అద్భుతమైన క్రియలో, దుష్టక్షత్ర = దుర్మార్గులైన రాజులను, నిబర్హణం = సంహరించుట, దశముఖాది = రావణాసురుడు మొదలైన వారిని, ఉన్మూలనం = మొదలంట సంహరించుట, కర్షణం కాళింద్యాః = యమునా నదిని ఆకర్షించుట, అతిపాప కంస నిధనం = మిక్కిలి పాపాత్ముడైన కంసుని చంపుట, యత్క్రీడితం = ఎవరికి ఆటలో, తం = ఆ శ్రీమన్నారాయణుని గూర్చి, నమః = నమస్కరించుచున్నాను.

తాత్పర్యము:- విభవావతారములు అనేకములు. ఐనను సంగ్రహించి ఒక 10 అవతారాలను అవతార క్రమంలో ఏర్పరచడం జరిగింది. అందు మొదటిది మత్స్యావతారము. ఈ అవతారము యొక్క విశేషములు వ్యాస ప్రణీత భాగవతంలో చెప్పబడినవి. అదేకాక తక్కిన అవతారాల వివరణం గూడా వుంది. ఐతే ఈ శ్లోకంలో వాచ్య వరదాచార్యులగారు కల్కి అవతార ప్రస్తావన తేలేదు.

కృష్ణావతారంలో అనగా 9 అవతారాలతో పూర్తి చేశారు. "మత్స్యః కూర్మ వరాహ" అనే శ్లోకంలో బుద్ధః కల్కి రేవచ. అని బలరామావతారం చెప్పక బుద్ధావతారం, కల్కి అవతారం అని ముగించబడింది. మరి వ్యాస భాగవతంలో 21 అవతారాలు కొనియాడబడినవి. అనంతమైన అవతారాలని భగవత్ గీతలో భగవానుని వాక్యం. "బహూని మే వ్యతీతాని జన్మాని తవచార్జున" అని. ప్రస్తుతం ఈ శ్లోకంలో అవతారం లోని ప్రధాన ప్రయోజనం తెలుపబడింది.



శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

1. ఒకప్పుడు సోమకాసురుడనే వాడు బ్రహ్మ దగ్గరి వేదాల నపహరించి సముద్రంలో దాగి యుండెను. బహ్మ సృష్టి చేయుటకు సాధనం లేక యున్న కాలంలో శ్రీమహావిష్ణువు నీళ్ళలోనే పుట్టి నీళ్ళలో సంచరించడమే తప్ప నేలపై ఉండుటకు వీలులేని, కండ్లు మూసుకొనుటకు వీలులేని 'చేప'గా అవతరించి ఎక్కడో సముద్ర గర్భంలో దాగియున్న సోమకుని వెదకి వాడిని సంహరించి వేదాలను తెచ్చి బ్రహ్మకిచ్చినాడు.

2. కూర్మంగా మందరాద్రి భరణ : దేవ దానవులు అమృతం కొఱకై క్షీరసాగర మథనం చేయ సంకల్పించినారు. సముద్రాన్ని చిలకాలి. మరి కవ్వము (చిలికే సాధనము) కావాలి. అందుకు మందర పర్వతాన్ని కవ్వంగా చేశారు. ఆ పర్వతాన్ని సముద్రంలో వేసేప్పటికి అది మునిగి పోయింది. అప్పుడు శ్రీమన్నారాయణుడు తాను కూర్మరూపాన్ని ధరించినాడు. కూర్మం నీళ్ళలోనే ఎక్కువకాలం వుంటుంది. భూమిపైన గూడా తిరిగే అవకాశం ఉంటుంది. ఆ కూర్మం గానే ఎందుకు ? అంటే దాని వీపు భాగం గట్టిగా వుంటుంది. తల, కాళ్ళు ఉంటవి గాని ప్రమాదాన్ని ఊహించి నప్పుడు వాటిని ఆ డిప్ప అంటే వీపులోపలికి సంగ్రహించుకుంటుంది. అందుకే 'కూర్మాంగానీవ సంహృతః' అన్నాడు గీతాచార్యుడు. ఆరకంగా తాను కూర్మమై తన వీపు మీద మందర పర్వతాన్ని ధరించి అమృతం లభించిన పిదప తాను 'మోహిని' అవతారమెత్తి దేవతలకు మాత్రమే అమృతాన్ని ప్రసాదించినారు

3. వరాహంగా, క్ష్మోద్ధారణ హిరణ్యాక్షుడు కశ్యపమహర్షి వలన దితి గర్భంలో కవలలుగా (మిగతా 15 వ పేజీలో)

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

(క్రిందటి సంచిక తరువాయి)

**వ్యంగ్యవేధ:–** "వ్యంగ్యోహీనాంగ భేకయోః" అను ప్రమాణానుసారము అంగహీనము కలదానిని వ్యంగ్య మన బడును. "వ్యంగ్యం చా పదర్శనం" అను లక్షణము కల్గియుండడం వల్ల గృహమునకు వుండ వలసిన అంగములలో ఏ అంగమయినా సక్రమముగా లేక పోవుట చేత ఆ గృహము అంగహీనముగా కనిపించును. దీనిని అనర్ధదర్శనము అంటారు. ఇలాంటి లక్షణము కల్గిన గృహం వ్యంగ్య వేధయను దోషమును పొందును. 'వ్యంగ్యేంచ అంగతాహీనం' అను ప్రమాణ శ్లోకముచే వ్యంగ్య వేధ పొందిన గృహం ఆ గృహయజమానికి అంగవైకల్యమును మతిభ్రంశమును శతృబాధయును కలిగించును.

**మురజవేధ:–** "పార్శ్వోన్నతంచ మురజం" అను ప్రమాణానుసారము సింహద్వారమునకు ఇరు పార్శ్వముల యందు గల భాగములో ఏ ఒక్క పార్శ్వమైనను ఎక్కువ ఎత్తు పొంది యున్న మురజవేధ దోషము కల్గును. "మురజే చ కులక్షయః" అను ప్రమాణానుసారము మురజయను వేధా దోషమును పొందిన గృహము గృహ యజమాని యొక్క వంశమును నాశ మొనర్చును.

**కుటలవేధ:–** "కుటలం తాలహీనం" అను ప్రమాణాను సారం కుటలవేధ దోష లక్షణము. "కుటలం పదం నీవ్రం" అను వచనముచే కుటల మనగా ఇంటి చూరు అని అర్ధము. "తాళం కరతలే అంగుష్ట మధ్యమాభ్యాంచ సమ్మితే" అను వచన ప్రమాణముల చేత తాలమనగా అరచెయ్యి అని అర్ధము. చాపబడిన మధ్యమ అంగుష్టలచే కొలచబడిన కొలతయని యర్ధము. గృహము చూరు చాచబడిన మధ్యమ అంగుష్టములచే కొలవబడిన కొలతకంటే తక్కువ పరిమాణము వున్న యెడల ఆగృహము కుటలమను వేధాదోషమును పొందును. "కుటలేచ గృహక్షయః" కుటల మను వేధాదోషము గల గృహము, గృహ యజమానికి మృత్యువు వంశనాశనము కలిగించును.

**కుట్టకవేధ:–** కుట్టమనగా మలచుట యని అర్ధము. గృహనిర్మాణము చేయు భూమిని మలిచి దానిని పూడ్చకుండ అట్లానే నేల మట్టమునకు క్రింద భాగమునందు గృహమును నిర్మాణము చేసిన యెడల ఆ గృహము కుట్టకమను వేధా దోషమును పొందును. కట్ట బడిన గృహము యొక్క లోపలి భాగమును భూమట్టము కంటె తక్కువగా నుంచిన ఆగృహము నకు కుట్టకమను వేధా దోషము జనించును.

"కుట్టక భూతదోషః స్యాత్"



**శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల**
**సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి**

ప్రమాణానుసారము కుట్టకమను వేధాదోషము గల గృహము యజమానికి గృహములో వుండు వారలకు యక్ష, రాక్షస, వినాయక గ్రహ, భూత, ప్రేత, పిశాచ బ్రహ్మ, రాక్షసాది భూతావేశములను తత్సంబంధీయములగు బాధలను పీడలను క్షణమునకు ఒక విధముగ అనారోగ్య బాధను కలుగచేయును.

**సుప్తకవేధ:–** "సుప్తి స్స్వర్యా2జ్ఞతా నిద్రా విశ్రంభే శయనే స్త్రియాం" యిచట సుప్త మనగా నిద్రించుటయని అర్ధము. గృహనిర్మాణము కావించు స్థలము నిద్రించుచున్న సమయమునందు గృహ నిర్మాణము చేసిన యెడల ఆగృహము సుప్తకము అను వేధా దోషమును కల్గియుండును.

భూమియొక్క సుప్త లక్షణము (వాస్తు రత్నావళి)

**శ్లో॥ ప్రద్యోతనాత్పంచ నగాంక సూర్య**
**నవేందు షడ్వంశ మతేషు భేషు**
**శేతే మహీనైవ గృహం విధేయం**
**తతోగ వాపే ఖననం నశస్తం**

సూర్యుడున్న నక్షత్రము మొదలు 5–7–9. 12–19–26 నక్షత్రములలో భూమి నిద్రించుచుండును. కావున ఈ నక్షత్రముల యందు. గృహము నిర్మించ కూడదని అర్ధము. (మరొక గ్రంథ మతానుసారము)

(మిగతా 11 వ పేజీలో)




# భగవద్గీత


**శ్రీమాన్ శ్రీ సాతులూరి గోపాల కృష్ణమాచార్యులు**




**మన్నిమిత్తం కృతం పాపం పుణ్యమేవ భవిష్యతి** నాకోసం నువ్వు పాపం చేసినా పుణ్యమే వస్తుంది. అన్నాడు భగవంతుడు. ఆయన వంట కోసం ఇవన్నీ చేసాము కనుక ఈ పాపాలు ఏవీ మనకంటవు. ఆయన ఆరగించిన తర్వాత "తదమృతం భవతి" అది ఆయన కటాక్షం, ఆయన ఏమి పుచ్చేసుకోడుగా! చూడడమే కదా! ఆయన కటాక్షం పడితే అది అమృతం అవుతుంది. ఇదివరకైతే పాపం తిన్నవాళ్ళం. అదే అన్నాన్ని నైవేద్యం పెట్టి తింటే అమృతాన్ని తిన్నవాళ్ళం అవుతాము. అంత గొప్పతనం వుంది. దానికి ప్రత్యామ్నాయం గా నివారణోపాయాన్ని సూచిస్తుంది. ఇదే స్మృతి చేసే పని. ఇట్లా వేదం కంటే కూడా సుకరంగా అందరికి అందుబాటులో వుండే విధంగా అందరికి భగవద్గీత ఇంత విజ్ఞానాన్ని అందించింది. మిగతా వాటికి లేని గొప్పతనం భగవద్గీతకు మాత్రమే వున్న గొప్పతనం ఏమిటి? **యా స్వయం పద్మనాభస్య ముఖ పద్మాత్ వినిసృతా** సాక్షాత్ కృష్ణ భగవానుడు నోరు తెరచి అనుగ్రహించినటువంటి గ్రంథం ఇది. కనుక, ఆయన వదనకమలం నుంచి జాలువారి నటువంటిది కనుక దీనికి వుండేటువంటి ప్రామాణ్యం మిగతా గ్రంథాలకు ఇంత ఉండదు. మిగతావాళ్ళు అందరు ఎవరు? లోకంలో కవులు అనేక కావ్యములు రాస్తున్నారు. రాసినవాళ్లు కావ్యాలను ఎలా రాయగలిగారు. అది ఒక ఉపాసన, సర్వస్వతి కటాక్షం అనుకోండి, బ్రహ్మ కటాక్షం అనుకోండి, రామాయణం వచ్చిందంటే అది బ్రహ్మ కటాక్షం. మరి భగవంతుడే స్వయంగా చెబితే! శాస్త్రములు వ్రాసిన ఋషులందరు భగవదనుగ్రహాన్ని పొంది, అందులో విజ్ఞానాన్ని పొంది వ్రాసినవి. ఇది భగవానుడే సాక్షాత్తుగా చెప్పినది. భగవద్గీతతో సదృశమైన శాస్త్రము మరొకటి లేదు. ఎంతో సులభంగా, ఎక్కడా కఠినమైన శ్లోకం కనబడదు. ఆమాత్రం ఏమాత్రం సంస్కృతం వచ్చిన వారికి అయినా చక్కగా అర్థం అయిపోతుంది. రామాయణంలాగే భగవద్గీత కూడా అర్థమైపోతూ ఉంటుంది. అసలు సంస్కృతం రానివారు కూడా ఈ భగవద్గీతలో 'కొటేషన్స్' చెప్పేసి ఉపన్యాసాలు చెప్పేస్తున్నారా లేదా! చెబుతున్నారుకదా!



భగవంతుడు అలా అంత సులభంగా అందించడు. భగవంతుడు సాయించాడు అంటే 'సర్వ శాస్త్రమయీ గీతా' అన్ని శాస్త్రములు భగవద్గీతలోనే వున్నాయి. అక్కడక్కడ ప్రాదేశమాత్రముగా స్పృశించబడ్డాయి. కనుక **భగవద్గీతా కించిదధీతా గంగా జలలవ కణికాపీతా** శంకర భగవత్పాదుల మాట ఇది. భగవద్గీత కొంచెం చదివినా, ఒక శ్లోకం, ఒక అధ్యాయం చదివినా, గంగాజలం కొంచెం ఆచమనం చేసినా, మన పాపములన్నీ నశిస్తాయి. కనుక భగవద్గీత నిత్యానుసంధేయమైనటువంటిది.

ముక్తిఉపాయాదులను మాత్రమేకాక భగవంతుని స్వరూప స్వభావాదులను గీతాశాస్త్రంలో సమీరితం (చెప్పబడినది). యామునమునుల యొక్క గీతార్థ సంగ్రహంలో ఒక గొప్ప మాట చెప్పారు. సమీరితం అంటే భగవంతుని యొక్క స్వరూప జ్ఞానాదులన్నీ కూడా 'సమ్యక్ ఈరితం' అంటే లెస్సగా చెప్పబడినవి.

భగవంతునికుండే స్వభావాలేమిటి? జగత్ కారణత్వ, సర్వనియామకత్వ, సర్వ అంతరాత్మత్వ, సమస్త కళ్యాణ గుణాకరత్వ, అఖిలహేయ ప్రత్యనీకత్వాది సమస్త స్వభావములను భగవద్గీతలో సమగ్రముగా చెప్పాడు భగవానుడు. జీవుని గురించిగాని, దేవుని స్వరూపాన్ని

గురించి గాని, ప్రకృతిని గురించి గాని 13,14,15 మూడధ్యాయాలు. 13 వ అధ్యాయం క్షేత్రక్షేత్ర విభాగ యోగం అంటే జీవ స్వరూపం. గుణత్రయ విభాగ యోగం 14వ అధ్యాయం అంటే ప్రకృతి స్వరూపం, పురుషోత్తమ ప్రాప్తి 15 వ అధ్యాయం అంటే పరమాత్మ స్వరూపం సమగ్రంగా తెలిపినటువంటి గ్రంథం భగవద్గీత. ముక్తిఉపాయాదులు కేవలం ఫలాన్ని చూపించి వదిలేయడం కాకుండా ఫలమును చెప్పి ఫలమును పొందే సాధనములు తెలుపును. ఈ రెండిటిని తెలపడం కాదు ఈ రెండు తానే అని తెలుపును. ఫలమూ తానే ఫలమునొసగే సాధనమూ తానే అని తెలిపడం భగవద్గీతా శాస్త్రము చేసినటువంటి మహోపకారం. ఇలాంటి భగవద్గీతా శాస్త్రాన్ని గురించి ఎన్నో ఉపన్యాసాలు చెప్పుకోవడం జరిగింది. **ప్రపత్తి శ్రీసన్నిధానం** మాసపత్రికలో అనేకమైన ప్రముఖుల విద్వాంసుల నుండి వచ్చే చాలా అద్భుతమైన వ్యాసముల నెన్నింటినో ప్రచురింప చేస్తున్నారు. ఈ వ్యాసములన్ని బాగా ప్రచారంలోకి వస్తున్నాయి. అందులో ఈ భగవద్గీత వ్యాసములు కూడా అందించడం జరుగుతుంది.

పాఠకులకు విజ్ఞప్తి ఏమిటంటే. కొన్ని ఉపన్యాసాలలో భగవద్గీతను చెప్పుకోవడం జరిగింది. గీతాభాష్యములో వుండే కొన్ని కొన్ని ప్రముఖములైన అంశములను స్పృశిస్తూ ధారావాహికంగా మన పత్రికలో అందరికి అందించడం జరుగుతుంది. అందరు అందుకొని ఆనందింతురు గాక!

(వచ్చే సంచిక నుండి తెలుసుకొందాం)

★

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

(9 వ పేజీ తరువాయి)

**శ్లో।। వేదాష్ట పంచాగ్ని రసాద్రి ఘుట్యాః**
**కూపే మహి ఉక్త దినేషు శేతే।**
**కూపే తదాగే త్వథ వాద్య గేహే।**
**బీజోప్తి లాంగల్య ముఖే2శుభంస్యాత్।।** అను ప్రమాణముచే సూర్యుడున్న నక్షత్రము 5-7-9-12-19-26 నక్షత్రముల యందు క్రమముగా 4.8.5.3.6.7 ఘడియలందు భూమి నిం్రదించుచుండునని ఈ ఘడియల యందు గృహము నిర్మాణము చేయకూడదు. భూమి యొక్క సుప్తా2సుప్త లక్షణములను గుర్తించవలయును.

'సుప్తే గృహపతేః మృత్యుః' అనుశాస్త్రానుసారము సుప్తక వేధా దోషమును పొందిన గృహము యజమానికి మృత్యువును కలుగచేయును, దరిద్రునిగా చేయును.

**శంకపాలక వేధ:-** 'శంకపాలం జంఘహీనం' అను వచనము చేత స్తంభములు లేకుండా వుండే గృహమును శంకపాల వేధా దోషము పొందును. "శంకపాలే కురూపంస్యాత్" శంక పాల వేధా దోషము గల గృహ యజమానునకు అందులో వుండు వారలకు కురూపులుగా వుండునట్లు చేయును.

**వికటవేధ:-** 'దిగ్వక్రత్వం వికటం స్మృతం' అను వచనానుసారము సింహద్వారము వికటముగా వున్న యెడల వికటమను వేధాదోషము కల్గును.

'వికటః పృధుకే2రమ్యే విశాల కరాళయోః' వికట మనగా విస్తారమని యర్థము. మిక్కిలి భయంకరమైనదని అర్థము. గృహ సింహద్వారమునకు మించి పెద్దగా వున్న భయంకరముగా వున్ననూ ఆగృహము వికట వేధాదోష క్రాంతము అగునని శాస్త్రము. 'వికటేచ పతినాశనం' అను ప్రమాణముచే వికట వేధ దోషము పొందిన గృహము యజమానునకు మరణము సంభవింపచేయును.

**కంకవేధ:-** "పార్శ్వహీనం తథాకంకః" అను ప్రమాణాను సారము నలుపార్శ్వములందు లేదా ఇరు పార్శ్వములందు గాని సమముగా వసారాలు ఉండక విషమసంఖ్యాకముగా వసారాలను వుంచినను లేదా వసారాలు హెచ్చుతగ్గులుగా వుంచినను కంకమను వేధ దోషము కల్గును. 'కంకైశూన్యం' అను వచనముచే యజమానిని దరిద్రబాధలతో నాశనము చేయును.

**కైకర వేధ:-** 'కైకరం హస్త తోన్నతం' అను ప్రమాణముచే సహజముగా ఉండవలసిన పరిమాణముకన్న విస్తృతముగా గాని ఉన్నతముగా గాని గృహము వున్నచో కైకర వేధా దోషము కల్గును.

"స్త్రీహానిః కైకరే భవేత్" అను శాస్త్ర ప్రమాణముచే యజమాని యొక్క భార్యను చంపును గృహము, కనుక జాగ్రత్తగా పాటించవలయును,


(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

★



# దాశరథి శతకము

## (భక్తరామదాసుగారి సత్కృతికి 'భద్రవేది' వ్యాఖ్యానసన్నుతి)




(గతసంచిక తరువాయి)

**శమక్షమాది శృంగార గుణాభిరామ!**

భద్రవేది వ్యాఖ్యానము

గుణము అనగా అభ్యసించబడునది అని అర్థం. గుణ– ఆఖ్యానే అనే ధాతువునుండి ఏర్పడిన ఈమాటకు తెలియ చేయుట, లెక్కించుట అనే అర్థములు కూడ ఉన్నవి. **గుణ్యతే–మన్త్ర్యతే మన్త్రణాదిభిః నిశ్చీయతే ఇతిగుణః** అనే మరో నిర్వచనము కూడ ఉన్నది. గుణము అనగా ఆలోచింప చేయునది. నిశ్చయాత్మకమైన స్థితిని కలిగించునది అనికూడ పెద్దలు వ్యాఖ్యానించి యున్నారు.



అర్థాత్ **గుణ్యతే అభ్యస్యతే ఇతిగుణః** అనే నిర్వచనము ద్వారా దేనిని మనం మరల మరల అభ్యసించుట అలవాటును చేసుకొనుట ద్వారా ఉత్తములుగా తీర్చిదిద్ద బడుచున్నామో, తెలియబడుచున్నామో, గణించబడుచున్నామో, సరియగు ఆలోచనము ద్వారా నిశ్చయబుద్ధిని పొందగలమో, దానికి గుణము అని పేరు.

శ్రీరామాయణ కావ్యావిర్భావమునకు మునుపు వాల్మీకి మహర్షి నారదుని అడిగిన మొట్టమొదటి ప్రశ్న ఇదే. గుణవాన్ కః? ఈ ప్రశ్నకు అనుగుణములే, మిగిలిన పదిహేనుగుణములు. గుణవాన్, వీర్యవాన్ ఇత్యాది వాల్మీకి అడిగినది పదహారు గుణములుగానే కనిపించు చున్నప్పటికీ ఆ గుణములే అనంత గుణములకు నిదానములై ఉన్నవి. కనుకనే నారదుడు ఓవాల్మీకి! **బహవో దుర్లభాశ్చైవ యేత్వయాకీర్తితా గుణాః** నీవు అడిగిన గుణములు అసంఖ్యాకములు, దుర్లభములు అని గుణానంత్యమును ప్రకటించి యున్నాడు.

శ్రీరాముని యొక్క సాహచర్య సౌభాగ్యమును పొందిన అయోధ్యా ప్రజలు కూడ దశరథ చక్రవర్తితో **బహవో నృప! కళ్యాణగుణాః పుత్రస్య సన్తితే** ఓరాజా! నీకుమారుని యొక్క గుణములు అసంఖ్యాకములు, అన్నియూ కళ్యాణగుణములే అని ఉద్ఘోషించినారు. బహవః అనే పదం లెక్కించుటకు వీలు

### శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు

కానివి అనే అర్థాన్ని తెలియజేయుచున్నది. **సంఖ్యాతుం నైవ శక్యన్తే గుణాః** అనినట్లుగా అసంఖ్యాకములే. శ్రీరామాయణ మంతయు సగుణ బ్రహ్మమును స్థాపించుటకై అవతరించిన వేదహృదయము. అది ఆదినుండి అంత్యము వరకు శ్రీరాముని సకల కళ్యాణ గుణాకరునిగానే స్థాపించినది. వేదహృదయము అనగా గాయత్రీ మహామంత్రము, వేదమాతృకగా శాస్త్రములచే కీర్తితము.

**గాయత్ర్యాః హి స్వరూపంతత్ రామాయణ మనుత్తమమ్** అని వాల్మీకియే ప్రకటించియున్నాడు. గాయత్రీ మంత్ర తత్త్వార్థమే శ్రీరామాయణము అని తెలియుచున్నది

ఆ మంత్రములోని **వరేణ్యం – భర్గః** అను పదద్వయము భగవంతుని కళ్యాణగుణజాతమునే ఉపాస్య విషయముగా చెప్పుచున్నది. **తస్మిన్ యదన్తః తదుపాసితవ్యమ్** అను తైత్తిరీయ మంత్రము ఆ భగవంతునిలోని ఏ కళ్యాణ గుణ సమూహము యున్నదో దానిని ఉపాసించుమని బోధించు చున్నది.

**వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా** అని పరమశివుడు పలికినట్లు వేదమే శ్రీరామాయణము. ఆవేద ప్రతిపాద్యుడైన పరమపురుషుడే శ్రీరాముడు. ఆ రాముడు సగుణుడు, సాకారుడు. సకలకళ్యాణగుణాకరుడు, సర్వదివ్య మంగళ విగ్రహుడు. అటువంటి కళ్యాణగుణాకరుడు

## దాశరథి శతకము

మంగళాకారుడు అయిన భగవంతుని శ్రీరామునిగా బోధించుటకై అవతరించిన వేదమే శ్రీరామాయణము.

ఆ వేదకావ్యము గుణకీర్తనముతోనే ఆరంభమై గుణకీర్తనము తోనే సుసంపన్నమైంది.

**ఆదావన్తే చ మధ్యే చ హరిస్సర్వత్ర గీయతే** అని వేదమును భగవద్గుణ కీర్తనముగానే పెద్దలు సంభావించియున్నారు అవి అగణ్యములు.

**నాన్తం గుణానాం గచ్ఛన్తి తేనానన్తో2యమీరితః** గుణములను పూర్తిగా కీర్తించుట సాధ్యము కాదు కావున అనంతములయిన గుణములు కలిగిన భగవంతుడు అనంతుడుగా కీర్తించబడుచున్నాడు.

**విష్ణోర్నుకం వీర్యాణి ప్రవోచం యః పార్థివాని విమమే రజాగ్ంసి** ఇత్యాదిగా యజుర్వేదం భూమి యందలి ధూళి కణములను ఏవిధముగా లెక్కించలేమో అదేవిధముగా భగవంతుని యొక్క దివ్య గుణచేష్టితములను కూడా లెక్కించలేము' అని తెలియజేయుచున్నది

**యోవా అనన్తస్య గుణానన్తాన్**
**అనుక్ర మిష్యేత్ సతుబాల బుద్ధిః**
**రజాంసి భూమేర్గణయేత్ కథఞ్చిత్**
**కాలేననైవాఖిలశక్తి ధామ్నః**

ఎవడైతే అనంతుడైన భగవంతుని యొక్క అనంతములైన గుణములను లెక్కించ పూనుకొనునో వాడు అజ్ఞానియే. భూమియందలి ధూళి ధూసరములను లెక్కించుటకై ప్రయత్నించుటవంటిదేకదా! అని భాగవతము కూడ ఆ విష్ణు మంత్ర భావమును వివరించినది.

శ్రీరామదాసుగారు **శమక్షమాది శృంగార గుణాభిరామ** అను సంభోధనమున 'ఆది' శబ్దప్రయోగమునకు ఆంతర్యమిదియే. తాము రచించ తలపెట్టిన ఈ శతకము కూడ శ్రీరాముని యొక్క పవిత్ర గ్రంథమయమే కావడముచేత శ్రీరామాయణమునకు వలనే గుణకీర్తనముతో మొదలిడినారు.


శమము, క్షమ అను ఈరెండు గుణములను గుణ ప్రధానములుగా అనుకునుటలోని ఆంతర్యమును వీటిని శృంగార గుణములుగా పలుకుటలోని రహస్యములను వచ్చే సంచికలో తెలుసుకునే ప్రయత్నమును చేద్దాం!

**దాశరథీ! కరుణాపయోనిధీ!!** ★

## పుస్తక పరిచయం

### పండుగలు పరమార్థములు

తిరుమల తిరుపతి దేవస్థాన పుస్తక ప్రచురణలలోని గ్రంథసముచ్చయం ఏనాటి నుండో పుస్తక భాండాగారంగా ప్రసిద్ధి చెందింది. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రాచుర్యం చేసే సమాచారములు మరియు పరిశోధనా గ్రంథాలు ఎన్నో ఇక్కడ లభిస్తాయి. టీటీడీ ప్రచురణలలో మన పండుగల విశేషాలను అందించే గొప్ప పరిశోధనా గ్రంథం 'పండుగలు పరమార్థములు' ఈ గ్రంథ రచయిత ఆంధ్ర శేషగిరిరావు సాహిత్య పరిశోధకులు. తెలుగు రాష్ట్రాల్లో జరుపుకునే పండుగలు భారతదేశంలో ఏ ఏ ప్రాంతాల్లో ఎట్లా జరుపుకుంటారో వీరు వివరించారు. దానికి ప్రమాణమైన పురాణ గాధలను ప్రాంతీయ విశ్వాసాలకు సంబంధించిన వృత్తాంతాలను తెలిపారు. భౌగోళిక స్థితులచే ప్రభావిత మైన పండుగల ఆచారాలు నక్షత్ర గ్రహ గమనాల ద్వారా, ఋతువులు వాతావరణ మార్పులను బట్టి వచ్చే పండుగలు, పురాణ కథల ఆధారంగా చేసే వ్రతాలు నియమాలు సమగ్రంగా వివరించారు. పండుగల ఆచరణ వలన మానవ జీవన గమనంలో ఏర్పడే సంస్కారం, ఆరోగ్యం, భగవద్ అనుగ్రహం పొందే విధం ప్రతి పండగలో ఉండే పరమార్థం వివరించారు. ముఖ్యంగా తెలుగువారి సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు తెలియపరిచే విధంగా విస్తారమైన వివరణలతో రచయిత ఈ గ్రంథాన్ని పరిశోధనాత్మకంగా అందించారు. విషయ సూచికలో మాసముల పేర్లతో ఆయా మాసములలో వచ్చే పండుగలను క్రమంగా ముద్రించారు. గ్రంథం చివరలో ఆధార గ్రంథాల జాబితా ప్రచురించారు. 600 పేజీలతో చక్కని కళాత్మక ముఖచిత్రంతో ముద్రించబడిన ఈ గ్రంథం టీటీడీ ప్రచురణలలో అందుబాటుగా ఉంది. 2008లో వచ్చిన ఈ గ్రంథం జిజ్ఞాసువులకు పరిశోధకులకు కూడా ఉపయుక్తమైనది.




★

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

శ్రీమతి తిరుమల నీరజ



(క్రిందటి సంచిక తరువాయి)

## నర నారాయణుల అవతారం

నరుడు దైవికశక్తిని సంపాదించుకొన్న ఒక ఋషి. నారాయణుడు సాక్షాత్తుగా ఆ శ్రీహరి. ధర్మదేవుడు బ్రహ్మ శరీరభాగం నుండి పుట్టాడు. ఇతడు పదిమంది దక్షప్రజాపతి పుత్రికలను వివాహ మాడాడు. వారి వల్ల కలిగిన పలువురు సంతానంలో హరి, కృష్ణుడు, నరుడు, నారాయణుడు అనేవారు ప్రధానులు. హరి, కృష్ణుడు యోగు లయ్యారు. నర నారాయణులు ఋషులయ్యారు. హిమాలయాలలో ఉన్న బదరి కాశ్రమంలో వీరిద్దరూ అనేక వేల సంవత్సరాల పాటు బ్రహ్మమును గురించి తపస్సు చేశారు.

దేవతలు, దానవులు క్షీరాబ్ధిని మథిస్తే, అమృతం వెలువడింది. శ్రీమహావిష్ణువు మోహినీరూపంలో రాక్షసులను మోసగించి, అమృతాన్ని దేవతలకు అప్పగించాడు. అప్పుడు రాక్షసులు ఇంద్రుని పైకి దండెత్తారు. ఇంద్రుని పక్షాన నరనారాయణులు యుద్ధం చేసి, రాక్షసులను పారద్రోలారు. ఇంద్రుడు నరుణ్ని అమృతరక్షకుడుగా నియమించాడు.

ఈ నరనారాయణు లిద్దరూ విడదీయలేని మహర్షులు. వీరు బదరికాశ్రమంలో చేస్తున్న తపస్సునకు భంగం కలిగించా లని ఇంద్రుడు అనుకొన్నాడు. తానే ఘీంకారధ్వనులతో వారిని భయపెట్ట ప్రయత్నించాడు. సుడిగాలులు, వర్షాలతో భీకర వాతావరణం సృష్టించాడు. చివరికి ప్రత్యక్షమై వరాలు కోరుకోమన్నాడు. వారు కోరికలు తీరేందుకు తపస్సు చేయటం లేదు కనుక, తపస్సును ఆపలే మన్నారు. అప్పుడు దేవేంద్రుడు, తన పదవినే కోరి వారు తపస్సు చేస్తున్నారేమో అని అనుమానించి, కామధేనువును, రతీదేవిని, రంభ, మేనక తదితర అప్సరస్త్రీలనూ వీరి తపోభంగానికి పంపాడు. వారందరూ తమ నృత్యగానాదులతో తపోభంగానికి ఎంతగానో ప్రయత్నించారు. అప్పుడు నారాయణుడు, తన ఊరువులపై చేతితో చరచగానే, వీరందరి కన్నా సుందరి ఐన అప్సరోకన్య ప్రత్యక్ష మైంది. ఆమే ఉర్వశి. (మనం ఊర్వశి అంటూ ఉంటాము. సరైన ఉచ్చారణ ఉర్వశి. నారాయణుని ఊరువుల తొడల నుండి పుట్టింది కనుక ఉర్వశి.) వారందరూ విస్మితలయ్యారు. నారాయణుడు వారితో, “ఈమెను కూడా మీతోపాటు దేవలోకానికి తీసుకొని వెళ్లండి” అన్నాడు. లజ్జితలైన వారు ఆమెతోపాటు వెళ్లిపోయారు.

దక్షప్రజాపతి చేసిన యజ్ఞానికి మహాదేవుణ్ని ఆహ్వానించ లేదు. క్రుద్ధుడైన పరమశివుడు, తన శక్తిని దక్షుని పైకి పంపాడు. ఆ శక్తి దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసి, గాలిలో తిరుగుతూ బదరికాశ్రమం చేరింది. అక్కడ తపస్సు చేస్తున్న నారాయణుని హృదయాన్ని తాకింది. అక్కడి నుండి “హమ్” అనే నారాయణ శబ్దం బయటికి రాగా, ఆ శక్తి నిలువలేక వెనుదిరిగి, శివుని వద్దకే వచ్చింది. అప్పుడు పరమేశ్వరుడు నరనారాయణుల పైకి యుద్ధానికి వచ్చాడు. అప్పుడు నరుడు ఒక గడ్డిపరకను మంత్రించి విసరితే, అది గొడ్డలిగా మారి, శివుని మీదికి వచ్చింది. దానిని విరుగగొట్టిన పరమశివుడు, “ఖండపరశుడు” అనే పేరు పొందాడు. ఆ పైన నారాయణుని శక్తి వేడిమికి, శివుని కేశాలు నల్లబడి, ఎండిపోయిన గడ్డివలె అయ్యాయి.

ఒకప్పుడు అనివార్య పరిస్థితిలో చ్యవన మహర్షి పాతాళ లోకానికి వెళ్లవలసి వచ్చింది. అప్పుడు అక్కడున్న ప్రహ్లాదుడు, ఆయన ద్వారా భూమి మీది నైమిశారణ్యం, ఆకాశంలోని పుష్కరం, పాతాళంలోని పుష్కరతీర్థం గురించి తెలుసుకొన్నాడు. నైమిశారణ్య దర్శనానికి భూమి మీదికి వచ్చాడు. నైమిశతీర్థంలో స్నానం చేసి తీరంలో నడుస్తున్నాడు. దారిలో ఒక పెద్ద మర్రిచెట్టు, దాని మీద ఒకటే విధంగా ఉన్న ఎన్నో బాణాలు కనిపించాయి. అప్పుడు ప్రహ్లాదుడు, “ఆహా! ఇది ఋష్యాశ్రమాలు ఉండే చోటు కదా! ఇక్కడికి ఈ బాణపరంపరలు ఏ విధంగా వచ్చాయి? చిత్రంగా ఉందే?” అనుకొంటూ, చుట్టూ చూశాడు. దగ్గర లోనే కృష్ణాజినాలపై ధ్యానంలో ఉన్న ఇరువురు ఋషులను చూశాడు. వారు పెద్ద జటలతో తపస్సు చేస్తున్నారు.

ప్రహ్లాదుడు, "అయ్యలారా! ఈ దంభజపం ఎందుకు? ఇది ధర్మమార్గమా? తపస్సు, ధనుస్సు పరస్పరవిరుద్ధాలు కదా? మీ తపస్సు లిక కట్టి పెట్టండి!" అన్నాడు. ఆ మాటలకు ఆ ఋషులు, "ఓయీ! మా తపస్సు గొడవ నీ కెందుకు? మేము బ్రాహ్మ క్షాత్రాలలో నిష్ణాతులం కనుక ఇట్లా ఉన్నా మనుకోరాదా? పో! పో! బ్రాహ్మణులతో వ్యర్థంగా వైరం పెట్టుకోకు!" అన్నారు. ప్రహ్లాదుడు కోపగించుకొన్నాడు. "ఏమి టేమిటీ? మీరే విప్రులు, మీదే తపస్సు అనుకొంటున్నారా? బ్రాహ్మ క్షాత్రాలలో ప్రవీణులైతే, ఏదీ చూద్దాం, మీ క్షాత్రాన్ని నా మీద చూపండి! మీ పస ఏమిటో తెలిసిపోతుంది! ముక్కు మూసుకొని మూల కూర్చొనే మునులకు ఈ విల్లమ్ములు ఎందుకు? అని అడిగినంత మాత్రానే నేను మీ కింత చులకనై పోయానా? మగవారే ఐతే, మగువల వలె కూర్చోకుండా లెండి!" అని హుంకరించాడు.

అప్పుడు నరుడు, "సరే, కాచుకో!" అంటూ వింటిని అందుకొన్నాడు. ప్రహ్లాదుడూ ధనుష్టంకారం చేసి, బాణం తొడిగి నరుని మీద ప్రయోగించాడు. నరుడు ఆ శరాన్ని మధ్యలోనే తుంచేశాడు. ఈ ప్రకారం మొదలైన ఆ రణం, క్రమంగా చినికి చినికి గాలివానగా మారి, మహా యుద్ధంగా పరిణమించింది. ప్రళయకాల మేఘం వలె గర్జనలు, అతి తీక్ష్ణ మైన శస్త్ర అస్త్ర ప్రయోగాలు, మాయా కల్పనలు ఒక టొకటిగా ఆరంభమై, పోరు భయంకర మైంది. దేవతలు ఆకాశం నుండి పూలవాన కురిపిస్తున్నారు.

నారాయణుడు సైతం చేయి చేసుకొని, ప్రహ్లాదుని మీద ఎన్నో బాణాలు ప్రయోగించి, అతడు వదలిన బాణాలను విరుస్తూ వీరవిహారం చేశాడు. "ఇటువంటి సంగరం అపూర్వం, అసదృశం!" అని దేవ గంధర్వులు ఆకాశం నుండి ప్రశంసించారు.

ఈ విధంగా వేయి సంవత్సరాలు ఆ సమరం సాగింది. ఎవ్వరికీ విజయం లభించలేదు. ఇంతలో శంఖచక్రగదాపాణి ఆ శ్రీమహావిష్ణువు అక్కడికి విచ్చేశాడు. ప్రహ్లాదుడు యుద్ధం మానేసి, భక్తితో శ్రీహరి పాదకమలాలపై వాలిపోయాడు. విష్ణువు అతనిని లేవదీసి, "వత్సా! ఈ ఇద్దరూ నా వారు. నీవీ విధంగా ఎన్ని జన్మలు పోయినా వీరిని జయించలేవు. వారితో స్నేహం చేసుకొని సుఖంగా ఉండు!" అని అంతర్ధాన మయ్యాడు.

అప్పటికి ప్రహ్లాదుడు, ఆ ఋషులు నర నారాయణులని గ్రహించి, వారి పాదాల మీద పడి క్షమాభిక్ష కోరాడు. వారు అతనిని కౌగిలించుకొని, "ఇది విలాసార్థం జరిగిన రణమే కాని, అన్యం కాదు. నీవు మా భక్తుడివి, మిత్రుడివి. నీకు శుభం కలుగుతుంది, పోయిరా!" అని ఆశీర్వదించారు. అతనిని పంపించి యథాప్రకారం తపస్సులో మునిగారు. ★

## శ్రీపతి స్తుతి - సుభాషితం మంచి మాట


(8 వ పేజీ తరువాయి) పుట్టిన వాడు. మహా బలవంతుడు. ఈ భూమండలాన్నంతా సముద్రంలో అండభిత్తిలో చేర్చినాడు. బ్రహ్మ మొట్ట మొదట స్త్రీ, పురుషులను దంపతులుగా పుట్టించినాడు. వారు స్వాయంభువ మనువు, శతరూప. వారిని సంతానోత్పత్తి చేయుమని ఆజ్ఞాపించినారు. అప్పుడు జీవులు నివసించడానికి భూమి లేదు. మొట్ట మొదట స్త్రీ, పురుషుల దాంపత్యం వలన జన్మించడం మనువు వలన సంభవించింది. కావున 'మానవులు అనే పేరు మనకు వచ్చింది. అంతకు ముందు పరమాత్మ మొదట సృష్టి చేశాడు, ఋగ్వేద శిరస్సులో "అథ పురుషో హ వై నారాయణో అకామయత" అంటూ ప్రారంభించి "ప్రాణము, మనస్సు ఇంద్రియాలు పంచభూతాలు" సృష్టించి బ్రహ్మను తన నాభికమలంలో ఆవిర్భవింప చేసాడు. ఆ బ్రహ్మను 4 వేదాల ఆధారంగా సృష్టి చేయుటకు ఆజ్ఞాపించినాడు. అప్పుడు ఆయన 'సృష్టికర్త' ఐనాడు. ఆయన గూడా కొంత సృష్టి చేశాడు. పూర్వం స్త్రీ, పురుష కలయిక లేకుండానే సంతానం కలిగింది

**శ్లో॥ సంకల్పాత్ దర్శనాత్ స్పర్శాత్ పూర్వేషాం అభవన్ ప్రజాః।**
**తపో విశేషైః సిద్ధానాం తథాత్యంత తపస్వినామ్॥**

అనగా సంకల్పం, చూచుట, స్పృశించుట ద్వారా సంతానం కలిగింది. అట్లే సిద్ధులకు, మిక్కిలి తపోనిష్ఠులకు కూడా తపో విశేషాల చేత సంతానం కలిగింది. కాబట్టి బ్రహ్మ మానస పుత్రులు సనక సనందనాదులు, సప్తర్షులు, నారదుడు, దక్షుడు మొదలైనవారు కలిగారు. మొదట పరమాత్మ చేసిన సృష్టి 'సమిష్టి సృష్టి' అని, పిదప బ్రహ్మ చేసిన సృష్టి 'వ్యష్టి సృష్టి' అంటారు. బ్రహ్మ తాను రెండు భాగాలుగా అయ్యి కుడి భాగం నుండి 'మనువు', ఎడమ భాగం నుండి 'శతరూప' దంపతులుగా జన్మింపచేసినాడు. అందుకే పురుషులకు కుడిభాగం శ్రేష్ఠమని స్త్రీలకు ఎడమభాగం శ్రేష్ఠమని వాడుక, స్వాయంభువ మనువు, శతరూపలను బ్రహ్మ ఆదేశించినాడు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో) ★

# అఖిలహేయప్రత్యనీకత్వమ్



**శ్రీమాన్ శ్రీ డా॥ ఈయుణ్ణి శింగరాచార్యులు**

భగవద్రామానుజ సిద్ధాంతంలో తత్త్వాలు మూడు అని అంగీకరింపబడింది. అవి, చిత్తు, అచిత్తు, ఈశ్వరుడు? అని మూడు.

ఈ మూడు తత్త్వాల స్వరూప, స్వభావాలను శ్రీపిళ్లై లోకాచార్యులవారు తత్త్వత్రయం అనే రహస్య గ్రంథంలో విశదంగా నిరూపించారు. ఈ మూడు తత్త్వాలలో, ఈశ్వర తత్త్వ లక్షణాన్ని నిర్వచించేటప్పుడు, వారు, మొట్టమొదటగా **అఖిలహేయప్రత్యనీకత్వం, కల్యాణైకతానత్వం** అనే లక్షణాలను ముందుగా ప్రస్తావించారు. వీటికే శాస్త్రాలలో ఉభయ లింగాలు అని పేరు. ఇవి రెండూ భగవంతుని నిరూపించే అసాధారణ లక్షణాలు. ఎటువంటి దోషాలకు అయిన ప్రతిభటుడై ఉండడం, అన్ని కల్యాణ గుణాలకు ఆశ్రయమై ఉండడం? అనే, భగవంతుని నిరూపించే, ఈ రెండు లక్షణాలు భగవంతుని నిరూపించే లక్షణాలలో చాలా ముఖ్యమైనవి అని దీని తాత్పర్యం.



ఈ రెండు లక్షణాలలోకూడా, ఏ దోషాలను లేకుండా ఉండడం? అనే మొట్టమొదటిది, అంటే, అఖిలహేయ ప్రత్యనీకత్వం అనేది. ముందు ప్రస్తావింపబడింది. దీనినిబట్టి, అన్ని కల్యాణ గుణాలకు ఆశ్రయమై ఉండడం కంటే కూడా, ఎటువంటి దోషాలు లేకుండా ఉండడం అనేది మిక్కిలి ప్రాధాన్యాన్ని కలిగినది. అరత్వ లక్షణాలలో ఇది అత్యంత ప్రధానమైనది? అని కూడా ఈ క్రమాన్ని బట్టి తెలుస్తున్నది.

ఈ అఖిలహేయప్రత్యనీకత్వ ధర్మాన్ని, వారే తరువాత సూత్రంలో వివరిస్తూ, "చీకటికి తేజస్సు వలె, సర్పాలకు గరుడుని వలె, వికారాది దోషాలకు ప్రతిభటుడై ఉండడం అఖిలహేయ ప్రత్యనీకత్వం అవుతుంది" అని అన్నారు.

విశదవాక్ శిఖామణి అయిన శ్రీవరవరమునులు తమ వ్యాఖ్యానంలో ఈ సూక్తిని వివరించేటప్పుడు, "ఇక్కడ, వికారాదులు అనే శబ్దం ద్వారా మూడు విధాలుగా ఉండే అచిత్తులకు కలిగే పరిణామాలు చెప్పబడతాయి. సూత్రంలోని "వికారాది" అనే పదంలోని ఆదిశబ్దం చేత సంసారి జీవులకు కలిగే అజ్ఞానం, దుఃఖం, ముక్తులకు కొంతకాలం పాటు సంసార సంబంధము కలిగి ఉండడం అనే దోషాన్ని కలిగి ఉండడం, నిత్యులు పరిచ్ఛిన్నస్వరూపాన్ని కలిగి ఉండడం, పరతంత్రతను కలిగి ఉండడం అనే దోషాలు చెప్పబడతాయి. వీటిలో దేనినీ భగవానుడు లేనివాడు, కనుక, భగవంతుడు అఖిలహేయ ప్రత్యనీకుడు అవుతున్నాడు అని వివరించి, తరువాత , ఈ సూక్తిని వేరొక విధంగా వివరిస్తూ, తనను ఆశ్రయించిన భక్తుల దోషాలను లేకుండా చేయడానికి మూలమైన, దోషప్రతిభటత్వం అఖిల హేయ ప్రత్యనికత్వం అవుతుంది అని కూడా చెప్పవచ్చు అని అన్నారు.

అంటే, భగవంతుడు ఏ దోషం లేకుండా ఉండడమే కాక, తనను ఆశ్రయించినవారిలో ఉండే దోషాలు ఎంతటి తీవ్రమైనవి అయినప్పటికీ, అవి తనకు ఏ విధంగానూ సోకనివాడై ఉండడమే కాక, వారిలో ఉండే ఆ దోషాలను అన్నిటినీ పోగొట్టగలిగిన ప్రభావాన్ని కలవాడు అని దీని తాత్పర్యం. ఇటువంటి స్వభావం లోకంలో మరెవ్వరికీ ఉండదు. అందువల్ల, ఇది భగవంతునికే ఉన్నది, కావున, ఇది భగవంతుని నిరూపించే అసాధారణ ధర్మాలలో మొట్టమొదటిది అని మన పూర్వాచార్యులు భావించారు.

ఈ విధంగా నిర్వచింపబడిన రెండు విధాలైన అఖిల హేయప్రత్యనీకత్వ లక్షణాలలో రెండవ ప్రకారాన్ని గూర్చి, "తిరుప్పాణ్" అనే దివ్యసూరి తమ "అమలనాది పిరాన్" ప్రబంధం ఆరంభ పాశురంలో నిరూపించిన విధాన్ని గూర్చి కొంచెం గమనిద్దాం.

ఈ ప్రబంధంలోని మొదటి పాశురంలో ఈ అళ్వార్లు శ్రీరంగనాథుని ఉద్దేశించి పలుకుతూ "ఆడియార్ క్కు ఎన్నై ఆళ్ పడుత్త విమలన్" (తన దాసులకు నన్ను దాసునిగా చేసిన విమలుడు) అని అన్నారు. అంటే, తన దాసులకు నన్ను దాసునిగా చేసిన తరువాతనే భగవానుడు విమలుడు అయ్యాడు, దోషాలు ఏమీ లేనివాడు అయ్యాడు అని ఈ సూక్తిలోని అర్థం.

దీనిని గమనించి చూస్తే, భగవానుడు విమలుడు, అంటే, అఖిలహేయ ప్రత్యనీకుడు ఎప్పుడు అయ్యాడో, ఈ సూక్తి స్పష్టం చేస్తున్నది అని తెలుస్తున్నది. ఈ అర్థం, ఇక్కడ, "అడియార్ క్కు ఎన్నై ఆట్పడుత్త విమలన్" (భగవద్భక్తులకు నన్ను పరతంత్రునిగా చేసినవాడు, అందువల్లనే, విమలుడు) అన్వయం ద్వారా సిద్ధిస్తుంది. ఈ విషయాన్నిగూర్చి కొంచెం వివరంగా చూద్దాం.

తనను ఆశ్రయించినవారిని తనకు దాసులుగా చేసికొని, ఆత్మలకు అంతరంగ నిరూపకంగా చెప్పబడే భగవచ్ఛేషత్వ, పారతంత్ర్యాలను వారికి కలిగేటట్లు చేసి వారి స్వరూపాన్ని కాపాడడం ద్వారా భగవానుడు విమలుడు కావడం అనేది విమలత్వంలోని మొదటి దశ. ఆ దశ, ఈ అమల నాది పిరాన్ ప్రబంధంలోని మొదటి పాశురంలో గల "అమలన్" అనే పదం ద్వారా ఇంతకు ముందే సూచింపబడినది. అయితే, ఇంత మాత్రంతో భగవంతుని అఖిలహేయ ప్రత్యనీకత్వం పరిపూర్ణంగా సిద్ధించలేదు, సిద్ధించదు కూడా. జీవస్వరూపాన్ని పరిపూర్ణంగా రక్షించినప్పుడు కదా, భగవానుని అఖిలహేయప్రత్యనీకత్వం పరిపూర్ణం అవుతుంది. జీవస్వరూపం ఎప్పుడు పరిపూర్ణతను సంతరించుకుంటుంది? అని ఆలోచిస్తే, భాగవత పర్యంతంగా, ఆచార్య పర్యంతంగా శేషత్వపారతంత్ర్యాలు సిద్ధించినపుడే కదా, ఆ జీవస్వరూపం పరిపూర్ణం అవుతుంది. అది, ఇప్పుడు, లోకసారంగముని వచనానికి విధేయుడై ఉండేటట్లు తమను చేయడం ద్వారా, తమ స్వరూపాన్ని పరిపూర్ణం అయ్యేటట్లు భగవానుడు చేశాడు, కనుక, ఆ స్వామి విమలుడు అయ్యాడు, తన స్వరూపంలో కూడా, ఎటువంటి దోషాన్ని లేనివాడు అయ్యాడు అని ఇక్కడ తిరుప్పాణ్ దివ్యసూరి అంటున్నారు.

భగవానుడు, జగత్తుకు అంతటికి తండ్రి, "భూతానా మవ్యయః పితా" ( ప్రాణులకు అందరికీ తండ్రి) అని శాస్త్రం చెబుతున్నది. తండ్రి తన సంతానం విషయంలో నిర్వహించవలసిన కర్తవ్యాలలో, సంతానాన్ని భౌతికంగా రక్షించడమే కాదు. వారి స్వరూపాన్ని, తగిన జ్ఞానాన్ని కలిగించడం ద్వారా, వారిని రక్షించే బాధ్యత కూడా తండ్రిపై ఉన్నది కదా. వారి శారీరక రక్షణను, లేక, ఆత్మరక్షణను కూడా చేయవలసినది తండ్రి కర్తవ్యమేకదా.

భగవానునకు "నారాయణుడు" అని పేరు. ఈ నారాయణ నామానికి రెండు విధాలయిన వివరణలను శాస్త్రం తెలుపుతున్నది నారాలు అనబడే చేతనాచేతనాలకు ఆధారమై, వాటికి ఉండేవాడు అని, ఆ చేతనాచేతనాలలో అంతర్యామిగా నిలచి ఉండి, వాటి స్థితి, ప్రవృత్తి నివృత్తులను నిర్వహించేవాడని ఈ విధంగా, రెండు విధాలయిన వివరణలు ఈ నామానికి తెలుపబడ్డాయి. ఈ రెండు అర్థాలు భగవంతుడు చేసే రెండు విధాలయిన రక్షణలను, అంటే, శారీరకమైన, స్వరూపపరమైన రక్షణలను తెలుపుతున్నాయి. చేతనాచేతనాలకు ఆధారమై ఉండడం ద్వారా, వాటి బాహ్యరూపాన్ని రక్షిస్తూ, వాటిలో అంతర్యామిగా నిలచి ఉండడం ద్వారా వాటి స్వరూప రక్షణను చేస్తున్నాడు, భగవానుడు.

జీవులకు అంతర్యామిగా ఉండి, వారి స్వరూప రక్షణను చేయడం అనేది వారి శేషత్వపారతంత్ర్యాలు భగవత్పర్యంగా ఉండడం మాత్రమే మాత్రం కాకుండా, భాగవత పర్యంతంగా, ఆచార్య పర్యంతంగా పర్యవసించేటట్లు చేసినప్పుడే దానిని పరిపూర్ణంగా నిర్వహించినట్లు అవుతుంది కనుక, అటువంటి స్వరూపాన్ని తనను ఆశ్రయించినవారికి కలిగేటట్లు చేసినప్పుడే పరమాత్మ రక్షణ కృత్యం పూర్తి అవుతుంది, అప్పుడే అతడు ఏ విధమైన లోటు లేని సర్వ భూత పితృత్వాన్ని కలిగినవాడు అవుతాడు కనుక, అప్పుడే అతని విమలత్వం, అంటే, అఖిలహేయప్రత్యనీకత్వం, పరిపూర్ణంగా సిద్ధిస్తుంది అనే, ప్రకృతంలో దివ్యసూరిసూక్తి లోని స్వారస్యం సహృదయ హృదయ మనోహరంకదా.



# శ్రీ కులశేఖరాళ్వారు వైభవము

ప్రత్యేకం

భక్తి అనే సముద్రమున మునిగి భగవంతుడనే రత్నమును పొంది బ్రహ్మానుభవమును అనుభవించు వారికే ఆళ్వారులని పేరు. వీరు ద్వాదశాదిత్యుల వలె పన్నెండు మంది. అట్టి పన్నిద్దరు ఆళ్వారులలో ఒకరు శ్రీ కులశేఖరాళ్వారు వీరు

**కుంభే పునర్వసూ జాతం కేరళే చోళ పట్టణే।**
**కౌస్తుభాంశం ధరాధీశం కుల శేఖరమాశ్రయే॥**

అన్నట్లు సూర్యుడు కుంభ రాశిలో సంచరించు సౌరమానం ప్రకారం కుంభ మాసంలో కేరళ రాష్ట్రంలోని చోళ పట్టణంలో క్షత్రియ వంశమున భగవంతుని కౌస్తుభమణి అంశంలో అవతరించారు. వీరిది పునర్వసు నక్షత్రం. శ్రీరాముని గుణగణములను పుణికి పుచ్చుకున్న మహనీయులు. శ్రీరాముడు ధరాధీశుడు. అనగా పృథివిని పరిపాలించిన రాజు. ఈయన కూడా ధరాధీశుడు. రాముడు ధర్మాత్ముడు. ఈయన కూడా ధర్మాత్ముడు. శ్రీరాముడు రంగనాథుని ఆరాధించినవాడు ఈయన కూడా రంగనాథుని యందు అపరిమితమైన భక్తి కలవాడు. సంప్రదాయంలో రామునికి పెరుమాళ్ అని పేరు. వీరికి గల వైలక్షణ్యమును బట్టి వీరిని సంప్రదాయమున "కులశేఖర ప్పెరుమాళ్" అని వ్యవహరిస్తారు. వీరు రచించిన ద్రావిడ ప్రబంధమునకు "పెరుమాళ్ తిరుమొళి" అని పేరు పెరుమాళ్ళ యొక్క అనగా భగవంతుని స్వరూప రూప గుణ విభూతులను వర్ణించు ప్రబంధము కనుక పెరుమాళ్ తిరుమొళి అని కులశేఖర పెరుమాళ్ రచించుట వల్ల పెరుమాళ్ తిరుమొళి అని ఈ ప్రబంధమునకు వ్యవహారము కలదు. చేర దేశము కోళిక్కోడు అని పేరు గల రాజ్యమునకు రాజైన దృఢవ్రతుడను రాజునకు ఆయన పట్టమహిషికి భగవద్ అనుగ్రహము వలన కలియుగము 28వ ప్రభవనామ సంవత్సరమున తమిళ "మాసి" మాసంలో సూర్యుడు కుంభ రాశిలో సంచరిస్తున్నప్పుడు శుక్లపక్ష ద్వాదశి గురువారం పునర్వసు నక్షత్రంలో కుల శేఖరులు అవతరించారు. తగిన కాలంలో రాజవిద్య యుద్ధ విద్య అతి శీఘ్ర కాలంలోనే నేర్చుకుని యువరాజై తన యుద్ధ నైపుణ్యముతో చోళ పాండ్య రాజ్యములను జయించి తన రాజ్యంలో చేర్చుకున్నాడు. దృఢవ్రతుడు కులశేఖరునకు రాజ్య పట్టాభిషేకము చేసి తాను వానప్రస్థాశ్రమమును స్వీకరించి వనములకు వెళ్ళాడు. కులశేఖరునకు వివాహమై 'ఇళై' అను కుమార్తె. దృఢవ్రతన్ అనుకుమారుడు కలిగారు. చాలా సంవత్సరాలు ధర్మబద్ధంగా రాజ్యాన్ని పరిపాలించాడు. ఆయన పాలనలో శ్రీరామరాజ్యాన్ని ప్రజలు దర్శించారు రాముడు రాజ్యాన్ని ఉపాసించాడని "రామో రాజ్యం ఉపాసిత్వా" అంటూ వాల్మీకి తన రామాయణంలో పేర్కొన్నట్లు కులశేఖరాళ్వారు కూడా రాజ్యాన్ని ఉపాసించాడు. కులశేఖరాళ్వార్‌కు ప్రతినిత్యం పురాణశ్రవణం చేయటం నిత్యకృత్యం. ప్రధానంగా ఆయన శ్రీరామాయణాన్ని చాలా శ్రద్ధగా వినేవారు. రాముడన్న రాముని ఆరాధ్యదైవం అయిన రంగనాథుడు అన్న అమితమైన భక్తి. వారి




**శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి,** స్థానాచార్యులు
శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం


నామములు (పేర్లు) వినిపించినా భక్తి పరవశుడైపోయేవాడు. తాదాత్మ్యాన్ని చెంది లీనమైపోయేవాడు. ఒకనాడు పురాణ ప్రవచనాన్ని చెప్పేవారు రామకథను చెబుతూ అరణ్యకాండలోని ఖరదూషణాది వధను చెబుతున్నారు ఖర దూషణాది పదు నాలుగువేల రాక్షసులతో రాముడు ఒక్కడు యుద్ధం చేస్తున్నాడు యుద్ధాన్ని చూడటానికై దేవతలు ఋషులు సంఘములుగా అంతరిక్షంలో నిలబడి ఉత్సుకతతో చూస్తూ

**చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణాం।**
**ఏకశ్చ రామో ధర్మాత్మా కథం యుద్ధం భవిష్యతి॥**

క్రూరకర్ములైన 14000 మంది రాక్షసులతో ధర్మాత్ముడైన రాముడు ఒక్కడే! యుద్ధం ఎలా జరుగుతుందో కదా! అని అందరూ కంగారు పడుతున్నారు అని చెప్పగానే కుల శేఖరుడు "ఓ సైన్యాధిపతీ! సైన్యాన్ని సిద్ధం చేయు! రామునికి సహాయానికి వెళదాం అని అన్నారట!" అప్పుడు పురాణ ప్రవాచకుడు "రాజా రాముడు 14000 మందిని జయించాడు" అని చెప్పగానే తెప్పరిల్లి ఈ లోకంలోకి వచ్చి స్వస్థుడయ్యాడట! అలాగే మరొక సందర్భంలో పౌరాణికుడు రావణుడు సీతను అపహరించాడని చెప్పగానే కులశేఖరులు సీతమ్మవారిని కాపాడటానికై ఉన్నఫళాన బయలుదేరాడట! నేరుగా శ్రీరాముడే సాక్షాత్కరించి "ఓ కులశేఖర ఇదిగో సీత. రావణుని సంహరించి సీతను కాపాడాను" అని చెపితే అప్పుడు శాంతించి కులశేఖరులు వెనుతిరిగారట! అటువంటి నిష్ఠ రామాయణంపై వారికి ఉన్నది. వైష్ణవ సంప్రదాయంలో ప్రధానంగా భగవంతుడు, భాగవతులు, గురువు అని వారికి సేవ చేయటం ముఖ్యం కులశేఖరులకు ఈ

సేవయే పరమావధి. వీరి వంశస్థులకు కులదైవం తిరువనంతపురం పద్మనాభ స్వామి ఆ స్వామికి వీరు ధర్మకర్తలుగా ఉన్నప్పటికీ శ్రీరంగనాథుని యందు వీరికి ఎనలేని భక్తి. కొంతకాలం రాజ్య పరిపాలన చేసిన తర్వాత తన కుమారుడైన దృఢవ్రతునకు రాజ్య భారాన్ని అప్పగించి శ్రీరంగం వెళ్లవలెనని సంకల్పించారు కులశేఖరులు. అది మంత్రులకు సామంతులకు ఇష్టం లేదు. ధర్మాత్ముడైన ఈయన ఇంకొంత కాలం రాజ్యపాలన సాగించాలని భావించిన వారు ఎంత ప్రార్థించినా ఆయన శ్రీరంగానికి వెళ్లాలని సంకల్పంతో ఉన్నారు. ఈయనకు భగవద్భక్తులైన భాగవతోత్తములకు సేవ చేయడం అంటే ఎంతో ప్రీతి. ఎల్లప్పుడూ వారి సేవలోనే తరించాలని భావించేవాడు.

**ఆడిప్పాడి అరంగవో ఎన్రత్తెక్కుమ్ తొండరప్పొడి**
**ఆడ నామ్ పెరిల్ కంగై నీర్ కుడైన్దాడుమ్ వేట్కై యెన్నావదే**

ఆడుతూ పాడుతూ శ్రీరంగా! అని పిలిచే భక్తుల పాద ధూళితో మనం మునుగుట జరిగితే ఇక గంగానదిలో స్నానము చేయవలెనని అనుకొనుట ఎందుకు అని భావించేవారు. గంగాజలం కంటే కూడా భాగవతోత్తముల పాద ధూళియే పవిత్రమైనదని భావించే స్వభావం ఆయనది. ఈయనకు గల భాగవత భక్తిని గమనించిన మంత్రులు వీరు శ్రీరంగానికి వెళ్లకుండా ఉండాలంటే రాజ్యానికి భాగవతోత్తములు వచ్చి ఉండేట్లు చేయాలి. అప్పుడు వీరు వారికి అతిథి సేవ చేస్తూ శ్రీరంగానికి వెళ్లకుండా ఇక్కడే ఉంటారు అని ఆలోచించి వీరు శ్రీరంగానికి ప్రయాణమైనప్పుడల్లా శ్రీవైష్ణవ స్వాములను ఆహ్వానించేవారు. వారికి పరిచర్యలు చేస్తూ వీరు శ్రీరంగ ప్రయాణాన్ని వాయిదా వేసుకునేవారు.

**ఘుష్యతే యస్య నగరే రంగయాత్రా దినేదినే**
**తమహం శిరసా వందే రాజానం కులశేఖరం** అనే ధ్యాన శ్లోకం ఈ విషయాన్ని వెల్లడిస్తోంది. పెద్దలు పూర్వం చెబుతూ ఉండేవారు ఈ శ్లోకాన్ని చదువుతూ దక్షిణం వైపుకు కొన్ని అడుగులు వేస్తూ నమస్కరిస్తే చాలు శ్రీరంగ క్షేత్రానికి వెళ్ళిన ఫలితం కలుగుతుందని వీరికి విష్ణుభక్తి ఎంత ఉన్నదో విష్ణు భక్తులపై కూడా అంత భక్తి. వీరు రచించిన ముకుంద మాల అనే స్తోత్రంలో

**మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే**
**మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ**
**త్వద్భృత్యభృత్య పరిచారక భృత్య భృత్య**
**భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ**

ఓ మధు కైటబులనే రాక్షసులను సంహరించిన స్వామి! నేను ప్రార్థించ తగిన నీ యొక్క అనుగ్రహము ఇదేనయ్యా అదేమంటే నీ దాసులకు దాసానుదాసులకు దాసానుదాసుడిగా నన్ను నీవు స్మరించు అదే నీవు నా మీద చూపే అనుగ్రహముగా భావిస్తాను. అని భగవంతుని విష్ణుభక్తులకు దాసుడిగా అనుగ్రహించమని ప్రార్థించారు. విష్ణు భక్తులపై వీరికి ఎంత విశ్వాసం అంటే వారి కోసమై తమ ప్రాణాలను కూడా లెక్క చేయనంత విశ్వాసం.


**ఈ శ్లోకాన్ని చదువుతూ దక్షిణం వైపుకు కొన్ని అడుగులు వేస్తూ నమస్కరిస్తే చాలు శ్రీరంగ క్షేత్రానికి వెళ్ళిన ఫలితం కలుగుతుంది**

ఒకసారి వీరి ఆస్థానంలో దేవునికి చెందిన బంగారు ఆభరణం కనిపించలేదు అప్పుడు ఆభరణాన్ని అర్చన చేసే వైష్ణవ స్వాములే తీసి ఉంటారని కొందరు చెప్పారట! అప్పుడు కులశేఖరులు వైష్ణవులు ఎప్పుడూ అటువంటి పని చేయరు అన్నారట! అలా అంటూనే మట్టి కుండలో ఒక విష సర్పాన్ని ఉంచి ఒకవేళ మీరు చెప్పినట్లుగా వైష్ణవులే ఆభరణాన్ని తీసి ఉంటే నన్ను ఈ కుండలోని పాము కాటు వేస్తుంది అని కుండలో చేయి పెట్టారట! ఆ పాము వీరిని కాటు వేయలేదు. వైష్ణవులు ఆభరణాన్ని తీయలేదని నిర్ధారించుకున్న తర్వాత ఆ ఆభరణాన్ని తీసినవాడు తన తప్పును ఒప్పుకొని క్షమాపణ చెప్పారట! విష్ణుభక్తులపై వీరికి గల విశ్వాసం అంతటిది. కొంతకాలం వీరు రాజ్యపాలన చేసి అందరిని ఒప్పించి తన కుమారుడైన దృఢవ్రతునికి రాజ్యభారాన్ని అప్పగించి తన కుమార్తె ఇళైతో తన భార్యతో కలిసి శ్రీరంగానికి వెళ్లి అక్కడే రంగనాథుని సేవలో గడిపారు. వీరి కుమార్తె ఇళై రంగనాథుని భక్తురాలు. ఆమె రంగనాథునే తన భర్తగా వరించింది. ఆమెను రంగనాథ స్వామికి ఇచ్చి వివాహం చేసారు. ఆమెకే "శేరవల్లి నాచ్చియార్" అని పేరు. నేటికీ శ్రీరంగంలో ఈమె అర్చామూర్తిని దర్శించవచ్చు. గోదాదేవిని రంగనాథునికి ఇచ్చి వివాహం చేసిన పెరియాళ్వార్ వలెనే వీరు కూడా తన కుమార్తె ఇళైని రంగనాథునికి ఇచ్చి వివాహం చేసి ఆయనకు మామగారయ్యే భాగ్యాన్ని పొందారు. మనం ఈ కులశేఖరాళ్వారులలో ఒక కర్మయోగిని, జ్ఞాన యోగిని, భక్తి యోగిని కూడా దర్శించవచ్చు.

శ్రీరాముని నక్షత్రమైన పునర్వసులో అవతరించి శ్రీరాముని గుణ గణములను సంతరించుకొని రాజ్యపాలన చేసి తత్వజ్ఞానియై భక్తి యందు ఉత్తమమైన భాగవత భక్తిని కలిగి ఉండి తనను తన వారిని తన సమస్తమును రంగనాథునికి సమర్పించిన మహనీయులైన కుల శేఖరాళ్వారు తిరునక్షత్రము 9వ తేదీ. ఆనాడు ఈ ఆళ్వారులు స్మరించుట మన కర్తవ్యం. వీరు అత్యంత మధుర భక్తి భరితమైన "పెరుమాళ్ తిరుమొళి" అనే ద్రవిడ ప్రబంధాన్ని "ముకుంద మాల" అనే స్తోత్రాన్ని రచించారు. ★

# జ్యోతిర్విజ్ఞానమ్

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక




గత సంచికలో తులసి మొక్క ప్రాధాన్యతను దాని వలన ఏర్పడే ఫలితాలని తెలుసుకొన్నాము. కొందరికి చెట్లు పెట్టుకోవాలి అనే కోరిక వుండి, స్థలం కూడా విశాలంగా వుంది. అందులో చెట్లు పెట్టుకోవడం ద్వారా పుష్పాలు, ఫలాలు వాటి వల్ల చక్కటి గాలి చల్లని వాతావరణం ఏర్పడుతుంది అనే ఆశవుంది. అయితే ఏ చెట్టును ఏదిశలో పెట్టడం ద్వారా గృహానికి ఎలాంటి శుభఫలితాలు కలుగుతాయి అనే విషయాన్ని తెలుసుకొందాము. ఎనభై నాలుగు లక్షల జీవరాసులు ఉన్నాయని, దానిలో చెట్లు కూడా ఒక భాగము అని మనకు పెద్దలు చెప్తారు. పూర్వ కాలంలో ఒకసారి నైమిశారణ్య ప్రాంతంలో ఋషులందరు కూర్చున్నపుడు అక్కడికి భరద్వాజ,అత్రి, వాలకిల్య, వశిష్ఠ ఇత్యాది వారందరు వచ్చినపుడు మహానుభావులు, మహాఋషులు ఎక్కడైతే కలుస్తుంటారో వారికి లోకానికి అందించవలసిన మంచి విషయాలు ఏమున్నాయి అనేది ఎప్పుడు ఆలోచిస్తూ వుంటారు. లోకకల్యాణం గురించి (కళ్యాణము అంటే సంతోషం) అనేకమైన అవసరమైన విషయాలని ఋషుల యొక్క చర్చల ద్వారా అందిస్తూ ఉండటం జరుగుతుంది. అలా ఋషులందరు సత్రయాగం నిమిత్తం నైమిశారణ్యం వచ్చినపుడు వశిష్ఠ, శౌనకాది, సూతులవారు ఋషులందరు ఉన్న సమావేశంలో ఒక సందర్భాన్ని అనుసరించి సూతులవారంటారు. "ఎనభై నాలుగు లక్షల జీవరాసులలో మానవ జన్మ చాలా గొప్పది. అందుకే మానవులమై పుట్టినదానికి ఈ లోకంలో భగవత్ సంబంధమైన ఆధ్యాత్మిక చింతన ద్వారా, లోకహితమైన కర్మల ద్వారా, ఎదుటివారిని సంతోషపరిచే మాటల ద్వారా, చేష్టల ద్వారా మానవుడు మహోన్నతుడై పరమాత్మ సన్నిధానాన్ని చేరుతాడు అని చెప్తారు. అసలు ఈ ఎనభై నాలుగు లక్షల జీవరాసులు ఎక్కడెక్కడ ఉంటాయి" అని అడుగుతారు మిగతా ఋషులు. అప్పుడు ఇలా చెప్తారు.

"వాటి గురించి చెప్పాలంటే చాలా సమయం తీసుకుంటుంది. కానీ వాటి నివసించే ప్రదేశాలు, గమనం వాళ్ళ కలిగే చేష్టితాలవల్ల వాటి గురించి తెలుసుకోవచ్చు. ఋషులారా నీళ్లలో నివసించే జంతువులు కొన్ని వున్నాయి, ఆకాశంలో ఎగిరే పక్షులు కొన్ని వున్నాయి, భూమి మీద నడిచే జీవరాసులు కొన్ని వున్నాయి. కొన్ని పక్షియా, జంతువా అని పూర్తిగా తెలుసుకోలేనివి కొన్ని వున్నాయి. కొన్ని కంటికి కనిపించని సూక్ష్మంగా జీవులు కూడా చాలా వున్నాయి. వాటి వివరణ చెప్తాను. ఒక చోట వుండి కదల లేక, మెదల లేక అక్కడే వుండే వృక్ష జాతులు కొన్ని వున్నాయి. అని సూతులవారు ఒక మాటలో ఈ విధంగా చెప్తారు.

**నవలక్షాని జలజాః దశలక్షాస్తు పక్షిణః**
**జన్తవో ద్వాదశలక్షాః వృక్షాశ్చ వింశతి లక్షకః**
**త్రింశతి లక్షాశ్చ కీటకాః అదృశ్యరూపిణో లక్షాః**
**లక్ష ద్వయంతు సందేహం సృష్టి రేవంచ దృశ్యతే**
**చతురాసీత్ రూపేణ సచ్చేవం జీవరాశయః**

తొమ్మిది లక్షలు నీళ్లలో సంచరించేవి, ఆకాశంలో ఎగిరేవి పదిలక్షలు, భూమి మీది జంతువులు పన్నెండు లక్షలు, ఇరవై లక్షల రకాల చెట్లు, ముప్పై లక్షల క్రిమి కీటకాదులు వున్నాయి. కంటికి కనిపించకుండా సంచరించేవి లక్ష రకాలు వున్నాయి. జంతువులా, పక్షుల అని తెలుసుకోలేనివి రెండు లక్షలు వున్నాయి. ఇవన్నీ కలిపితే సృష్టిలో ఎనభై నాలుగు లక్షల రకాలు వున్నాయి. జంతువు గాని పక్షి గాని తెలుసుకోలేనివి ఏమిటి? గబ్బిలం లాంటిది పక్షి అందామా అంటే ఈకలు గాని, ముక్కు గాని లేదు. అది గుడ్లు పెట్టి పిల్లలు చెయ్యదు. పక్షి కుండే లక్షణం లేదు. పోనీ జంతువు అందమంటే అది భూమిమీద నడవదు. పిల్లలనే నేరుగా పెడుతుంది. జంతువు అందమంటే అది చెట్లమీద ఆకాశంలో ఎగురుతుంది. పక్షులైతే రకరకాల ఆహారాలు తీసుకొచ్చి నోట్లో పెడుతాయి. కానీ గబ్బిలం పాలిస్తుంది. కనుక ఇది జంతువా పక్షా అని తెలుసుకోవటానికి అవకాశం తక్కువ

# ఆవేదన - నివేదన



ప్రతి మనిషి ఆనందాన్నే కోరుకుంటాడు. దుఃఖం కావాలనో రావాలనో ఎవరూ కోరుకోరు. మరి దుఃఖం ఎందుకని మనిషి దరి చేరుతుంది.? ఆనందం ఎందుకని దూరమై తీరుతుంది?. ఈ ప్రశ్నలకు ఎన్నో కారణాలున్నాయి. పూర్వజన్మలో మనం చేసిన పాపకర్మలు, మన చుట్టూ ఉండే పరిస్థితులు, మనలోని అసమర్థత, వచ్చిన సమస్యని అర్థం చేసుకోవడంలో అవగాహన లేకపోవడం, సోమరితనం, నిర్లక్ష్యం, అత్యాశ. ఇలా మన జీవితంలో ఆనందం రాకపోవడానికి, దుఃఖం పోకపోవడానికి ఎన్నెన్నో కారణాలు రణాలని సృష్టిస్తున్నాయి. "నాస్తి శోక సమం రిపుః" అంటారు శోకంతో సమానమైన శత్రువు మరొకటి లేదట. లోకంలో మనం గమనిస్తే శోకం లేని వారే ఉండరు. పిల్లల వల్ల కొందరు తల్లితండ్రులు దుఖిస్తారు తల్లిదండ్రుల వల్ల కొందరు పిల్లలు దుఃఖిస్తారు. భర్త వల్ల నా మనను గాయపడిందని భార్య దుఃఖిస్తే, భార్య గయ్యాలి అంటూ భర్త దుఃఖిస్తాడు, స్నేహితులే గోతులు తవ్వుతున్నారని కొందరు దుఃఖిస్తే, బంధువులు రాబందుల్లా ఉన్నారంటూ మరికొందరు దుఃఖిస్తారు.



ఏ బంధమైనా దుఃఖానికి అనుబంధంగానే ఉంది. తప్ప, దుఃఖంతో సంబంధం లేని బంధమే లేదు. అందుకే గీతాచార్యులు శోకంతో నిండిన ఈ లోకానికి "దుఃఖాలయం" అని నామకరణం చేసారు. దైవమున్న చోటు దేవాలయమైతే వైద్యం జరిగే చోటు వైద్యాలయమైతే, దుఖంతో నిండినది దుఃఖాలయం. వెంబడించే ఈ వేదనని, రోజూ ఉండే ఈ రోదనని రూపుమాపే సాధనని, వేదమాత బోధనలో చూడవచ్చు.

"తరతి శోకం ఆత్మవిత్" ఆత్మజ్ఞానం కలిగిన వాడే శోకాన్ని దాటగలడు. "శోకం సాగరమైతే జ్ఞానం నావ లాంటిది" అని వేదవాక్కు. ఆచార్యులని ఆశ్రయిస్తే అత్మజ్ఞానం అంకురిస్తుంది, అదృష్టం వరిస్తుంది. ఆత్మజ్ఞానం కలిగిన వ్యక్తి కష్ట, నష్టాలు కేవలం తన శరీరానికే తప్ప ఆత్మకి కాదని గ్రహించి ఈ జీవుడు, ప్రకృతి పరమాత్మకే చెందినవనే విశిష్టాద్వైత జ్ఞాననిష్ఠ కలిగితే

**శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు**

"దుఃఖేషు అనుద్విగ్నమనః" అన్నట్టు దుఃఖం కలిగినపుడు ఉద్వేగం చెందని మానసిక స్థైర్యంతో, మేరునగధీరునిలా, మహావీరునిలా, స్థితప్రజ్ఞుడై ప్రకాశిస్తాడు. భగవదు పాసకులగు ప్రహ్లాదుడు, ధృవుడు, శుకుడు, మొదలైన వారందరి ప్రజ్ఞ ఆ స్థితిలోనిదే, అందుకే వారంతా స్థితప్రజ్ఞులైనారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వారి ముఖంలో చిరునవ్వు చెదిరిపోక పోవడానికి కారణమేమంటే, వారికేర్పడ్డ ఆవేదనని పరమాత్మకే నివేదన చేస్తారు, నిశ్చింతగా ఉంటారు.

మనం కూడా ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలంటే మన ఆవేదనని పరమాత్మకి నివేదన (విన్నవించి) చేసి హాయిగా ఉండాలి.

"జీవితం అయోమయం కావాలంటే పెంచుకో మానసిక ఆవేదన! జీవితం ఆనందమయం కావలంటే ఎంచుకో ఆత్మ నివేదన!" నవవిధ భక్తుల్లో ఆత్మనివేదనం ఒకటి. బలి చక్రవర్తి ఈ ఆత్మనివేదనమనే భక్తి ద్వారానే మోక్షాన్ని పొందాడు. మనలోని అహంకారమే బలిలా మనని అజ్ఞానం వైపు నడిపిస్తుంది. దాసభావనయే ఆత్మనివేదనం ద్వారా అజ్ఞానం నుండి విడిపిస్తుంది. బలి తల కొలచిన పరమాత్మ శ్రీపాదాన్ని మన హృదయంలోనూ నిలుపుకుంటే జీవితమంతా ఆనందమయం అవుతుంది. ★

# పెరియాళ్వార్

## తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై రహస్యాలు

**తిరుక్కోళూరు పెణ్ పిళ్ళై చెప్పిన**

**81 వాక్యరత్నాలలోని 12 వ వాక్యమును గూర్చి ఈ విధంగా తెలుసుకుందాము.**

**ఎంబెరుమాన్ అవన్ణేనో పట్టర్ పిరానై పోలే**

పెరియాళ్వారుల వలె పరతత్త్వ నిర్ణయం చేసి ఎంబెరుమాన్ అతనే అని చెప్పలేని దానిని. అంటూ ఆమె తన నైచ్యానుసంధానాన్ని అనేక పాత్రల ద్వారా, భగవద్రామానుజుల కలయిక ద్వారా, తెలియజేస్తూ పెరియాళ్వార్ల చిత్తవైశాల్యము, చిత్త నైర్మల్యాన్ని లేని దానిని కనుకనే, ఈ ఊర్లో ఉండతగను అంటూ పెరియాళ్వార్ల వైభవం తెలియ చేస్తున్నారు.

సాక్షాత్తు స్వామికి వాహనమైన వేద స్వరూపుడైన గరుత్మంతుని అంశతో, పద్మ, ముకుంద దంపతులకు క్రోధన నామ సంవత్సరం, జ్యేష్ఠమాసంలో విష్ణుచిత్తులు అవతరించారు ఈలోకంలో. గరుడాళ్వార్ల అంశతో జనించిన విష్ణుచిత్తులు నిరంతరం భగవంతునిపై ధ్యాసతో పెరుగు తున్నారు. భగవానుని ఆజ్ఞ మేరకు శ్రీవిష్వక్సేనుల వారు వీరికి పంచసంస్కారాలు గావించారు. భగవంతుని సేవయే ఈ జన్మకు పరమార్థమని నమ్మి, విష్ణుచిత్తులు, భాగవత పారాయణతో కాలం గడపసాగారు.

భాగవత పారాయణ సందర్భంగా విష్ణుచిత్తుల వారిని ఒకఘట్టం ఆకర్షించింది. కంసుడు బలరామ కృష్ణులను చంపాలని ఉపాయంపన్ని అక్రూరుల వారిని పంపగా, ఆయనతో గోపాలురు, బలరామకృష్ణులు మధురకు వెళ్ళారు. ప్రవేశ ద్వారం దగ్గరే కువలయాపీడమనే ఏనుగును చంపి, నగరంలో ప్రవేశించిన శ్రీకృష్ణుడు వీధులగుండా తిరుగుతుండగా, ఈయన ముఖవర్చస్సు చూసి ముగ్ధుడైన, మాలాకారుడు (సుధాముడు) కంసుని అలంకారం కోసం, కడుతున్న దండలను శ్రీకృష్ణుని ముఖవర్చస్సు చూసి ఏంతో ప్రీతితో వానికి సమర్పించాడు.

ఆతని అనురక్తికి, భక్తికి తృప్తిపడ్డ శ్రీకృష్ణుడు ఏమికావాలి కోరుకో మనగా, **నీపాదకమల సేవయు, నీపాదార్చకులతో నెయ్యము। తాపస మందార నాకు దయ సేయగదే।।**

నీపాదాలు సేవించే భాగ్యం.

నీభక్తులతో కలిసి తిరిగే భాగ్యం,

సర్వప్రాణుల పట్ల దయ ఈమూడు భాగ్యాలు కలిగించు



**శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు, రాజమండ్రి.**

అని కోరాడు మాలాకారుడు. మాలాకారునికి ఇహలోక సుఖాన్ని, అఖండ మోక్షాన్ని ప్రసాదించాడు కృష్ణ స్వామి. ఈ ఘట్టంద్వారా పుష్పమాలా కైంకర్యం శ్రీపతికి చాలా యిష్టమైనదని గ్రహించారు శ్రీవిష్ణుచిత్తులు.

దాంతో ఒక తోటను ఏర్పాటు చేసుకుని, పులమొక్కలను తులసిని పెంచి, పూదోటను తయారు చేసుకుని, మాలలు స్వయంగా కట్టి, వటపత్రశాయికి సమర్పించుట దినచర్యగా మారింది వారికి (చేసుకున్నారు).

శ్రీవిల్లిపుత్తూరుకు ఉత్తరానగల మధురాపట్నం పరిపాలించే రాజు వల్లభదేవుడు. ప్రజల కష్టసుఖాలను తెలుసుకునేందుకు రాత్రివేళ మారువేశంలో తిరుగుతుండగా ఒక యాత్రికుడు, ఒకయింటి అరుగుపై కూర్చుని **వర్షార్థ మష్టౌ ప్రయతేత మాసాన్, నిశార్ద మర్థం దివసం యతేత।**

**వార్ధక్యహేతో ర్వయసాననేన, పరత్ర హేతో రిహ జన్మనాచ।।**

అంటూ చదువుతున్నాడు.

వర్షాకాలం అవసరమైన వస్తువులను మిగిలిన ఎనిమిది నెలలో సేకరించుకోవాలి. రాత్రి కోసం పగటి వేళలో సేకరించాలి. ముసలితనంలో సుఖాల కోసం వయస్సుతోనే సంపాదించుకోవాలి. పరలోక సౌఖ్యం కోసం ఈ జన్మలోనే జాగ్రత్త పడాలి. అన్న ఈవాక్యం రాజును ఆలోచింపచేసింది. మోక్షం సంపాందించుట ఎలా, ఏమార్గాన్ని అవలంబించాలి. అనే ఆలోచన ప్రారంభం అయింది. మార్గాన్వేషణ ప్రారంభించాడు రాజుగారు. కొంత ధనం మూట గట్టించి ఒక స్తంభంపై వ్రేలాడగట్టి, పండితులకు కబురుచేసి. పరదైవం నిర్ణయం చేసినట్లైతే ఆమూట జారిపడేలాగ నిర్ణయం చేశారు రాజు. (మిగతా 24 వ పేజీలో)



# శ్రీరామాయణంలో ఉపకథలు

# శ్రవణ కుమారుడి కథ



**శ్రీమతి చక్రవర్తుల చూడామణి, ఖమ్మం**

(క్రిందటి సంచిక తరువాయి)

దుఃఖిస్తూనే వాళ్ళిద్దర్నీ ఆ పిల్లవాడు పడి ఉన్న చోటికి తీసుకెళ్లాడు. తన కొడుకు శవాన్ని తడిమి చూస్తూ పరిపరి విధాల దుఃఖించి 'కుమారా ! మహావీరులు ఏ ఉత్తమ గతిని పొందుతారో, నువ్వు కూడా ఆ ఉత్తమ గతిని పొందుతావు.' సగర మహారాజు, శిబి చక్రవర్తి, దిలీప ప్రభువు, జనమే జయ భూపతి, నహుష మహీపాలుడు, ధుంధుమారుడు మొదలైన వాళ్ళు ఏ లోకానికి చేరారో, ఆ లోకానికి నువ్వు చేరుతావు.' అని అన్నాడు.

ఆ తర్వాత ఆ ముని దశరథుడిని చూసి' ఓ రాజా నా ఒక్కగానొక్క కొడుకును నీ బాణంతో చంపి నన్ను సంతాన హీనుడిగా చేశావు. ఇప్పుడు నన్ను అంతులేని పుత్ర శోకానికి గురి చేశావు. రాజా ఇలాగే నువ్వు కూడా పుత్ర శోకానికి లోనై మరణిస్తావు. ప్రాణాంతకమైన, భయంకరమైన పుత్రశోకం నిన్ను ఈ జన్మలోనే బాధిస్తుంది.' అని శపించాడని కౌసల్యతో దశరథుడు చెప్పాడు.



**తస్యాయం కర్మణో దేవీ విపాకః సముపస్థితః।**
**అపత్యైః సహ సంభుక్తే వ్యాధిరన్నరసే యథా॥**

(శ్రీ.రా.అ.కాం.63.6 )

'కౌసల్యా, అనారోగ్యకరమైన పదార్థాలు తిన్నవాడిని కాలాంతరంలో రోగాలు ఎలా పీడిస్తాయో, వేధిస్తాయో అలాగే ఆ మహాత్ముడు ఇచ్చిన శాపం నేనిప్పుడు అనుభవిస్తున్నాను. ఆ మాహాపాతకం నన్ను పీడిస్తోంది, యవ్వనంలో ఉండగా తెలియక చేసిన దోషం ఫలితంగానే నేను ఇవాళ పుత్రశోకం అనుభవిస్తున్నాను. ఈ శోకంతోనే నా జీవితం ముగిసిపోతుంది అని దుఃఖంతో మూర్ఛపోయాడు దశరథుడు.

ఇది సంక్షిప్తంగా వాల్మీకి రామాయణంలో ఉన్న శ్రవణ కుమారుడి కథ. వాస్తవానికి వాల్మీకి రామాయణంలో ముని కుమారుడు అని ఉంది కానీ శ్రవణ కుమారుడన్న పేరు కనపడదు. పద్మపురాణంలో వచ్చిన రాముడి కథలో ఈ పేరు కనబడుతుంది. ఆళ్వార్లు కూడా ఈ కథను తమ పాశురాలలో ప్రస్తావించలేదు. కానీ తల్లిదండ్రులకు సేవ చేసిన ఉత్తముడుగా శ్రవణ కుమారుడి కథ ప్రసిద్ధి చెందింది.

ఇందులో మనం గ్రహించాల్సిన విషయాలు ఏమున్నాయని చూద్దాం.

ముని బాలుడైన శ్రవణ కుమారుడు తన జీవితాన్నే తల్లిదండ్రుల సేవకు అంకితం చేసినవాడు. అంధులైన తన తల్లిదండ్రులకు అన్నీ తానై సేవ చేసాడు. ప్రాణం పోయే తరుణంలో కూడా దశరథుడిని తన తల్లిదండ్రుల దగ్గరికి వెళ్ళమని ప్రార్థిస్తాడు. తన తండ్రి కోపానికి గురి కాకుండా ఉండేందుకు ఉపాయం చెబుతాడు. తన ప్రాణం పోవడానికి కారణమైన దశరథుడికి మేలు చేయాలని ఆ ముని కుమారుడు ప్రయత్నించాడు.

**సంస్తభ్య శోకం ధైర్యేణ స్థిరచిత్తో భవామ్యహమ్।**
**బ్రహ్మ హత్యాకృతం పాపం హృదయాదపనీయతామ్॥**

(శ్రీ.రా.అ.కాం.63.49 )

**నద్విజాతిరహం రాజన్ మా భూత్తే మనసో వ్యథా।**
**శూద్రాయామస్మి వైశ్యేన జాతో జనపదాధిప॥**

(శ్రీ.రా.అ.కాం.63.50 )

నేను బ్రహ్మణుడిని కాదు, నీకు బ్రహ్మహత్యా దోషం అంటదు, నేను వైశ్యుని వలన శూద్ర స్త్రీకి పుట్టాను. అని ధైర్యం చెబుతాడు.

వెంటనే ఇక్కడ బ్రహ్మణుని చంపితేనే దోషామా? ఇతరుల

ప్రాణాలకు విలువ లేదా? అని చర్చ లేవనెత్తవచ్చు. బ్రాహ్మణుడు అంటే బ్రహ్మజ్ఞానం ఉన్నవాడు. సమాజానికి విత్తనం వంటి వాడు. రైతు ప్రాణం పోయిన విత్తనానికి ఉంచుకున్న ధాన్యం వండుకుని తినడు. ఒక్కొక్క విత్తనం భూమిలో పడితే లెక్కలేనన్ని గింజలను ఉత్పత్తి చేస్తుంది. ఎందరికో ఆకలి తీరుస్తుంది. వండుకుని తింటే ఒక్క పూటలో అయిపోతాయి. అలాగే బ్రహ్మ జ్ఞానం ఉన్న వాడు సమాజానికి ఉపయోగ పడతాడు. అతని ద్వార ఆ విద్య తరతరాలకు కొనసాగుతుంది. అలాంటి సంపదను పోగొట్టుకోకూడదు అనే అర్థంలో చెప్పబడింది.

త్రేతాయుగంలో అన్ని వర్ణాలవాళ్ళు తపస్సు చేసేవాళ్ళు. తపస్సు చేయడానికి విధి నిషేధాలు ఉండేవి కావు.

ఆ కాలంలోనే కులాంతర వివాహాలు జరిగాయి అని ఈ కథ వలన తెలుస్తుంది.

ఆ మునికుమారుడు అంత చిన్న వయసులో ఎంతో ఓర్పు, పెద్దల పట్లగౌరవం, తల్లిదండ్రుల పట్ల భక్తి, ప్రేమ కనబరుస్తాడు. అతనిలో అన్నింటినీ మించి పరిపూర్ణంగా వికసించిన మంచితనం, మానవత్వం కనపడతాయి .

తాపసుల పట్ల అందరూ గౌరవంగా నడచుకోవాలి. వారికి ఆపద కలిగిస్తే ఫలితాలు దారుణంగా ఉండేవి.

ఇంద్రియ నిగ్రహం లేకుండా చాపల్యంతో ప్రవర్తిస్తే రాజైనా సరే మునుల కోపాలకు, శాపాలకు గురి కాక తప్పదు. తెలియక చేసిన దోషమైనా, తెలిసి పశ్చాత్తాపపడినా ఫలితం అనుభవించి తీరవలసిందే. ఈ విషయంలో చక్రవర్తి అయినా మినహాయింపు లేదు అని అర్థమవుతుంది. పశ్చాత్తాపం కొంతవరకు పాపాన్ని తగ్గిస్తుంది, కానీ పూర్తిగా విముక్తి నివ్వదు. బ్రహ్మహత్యా దోషం మహా పతాకం. ఇంద్రుడైనా పదవీచ్యుతుడు కాక తప్పదు. నిష్కారణంగా అమాయకులకు ప్రాణహాని తలపెడితే తీవ్రమైన శిక్ష అనుభవించక తప్పదు. ఇవన్నీ త్రేతాయుగంలోనే ఉన్న ధర్మసూక్ష్మాలు. ఇవి అప్పుడే కాదు ఇప్పటికీ ఎప్పటికీ శిరోధార్యాలు.

కాబట్టి మనం ఇతిహాసాలలో కథల ద్వారా చెప్పిన ధర్మసూక్ష్మాలు గ్రహించి యుక్తాయుక్త విచక్షణ కలిగి ప్రవర్తించాలి. నిత్య జీవితంలో సూక్ష్మ దోషం కూడా జరగకుండా జాగ్రత్త పడే శక్తి శ్రీరాముడే మనకు ఇవ్వాలని కోరుకుందాం.

★

# పెరియాళ్వార్

(22 వ పేజీ తరువాయి)


పండితులు దేశదేశాలనుండి వస్తున్నారు, గానీ ధనం మూట మాత్రం కదలటంలేదు. శ్రీమన్నారాయణ పరతత్వ ప్రతిపాదనకు సమయం ఆయిందని, అందుకు తగిన వారు గరుడాంశ సంభూతులైన విష్ణుచిత్తులేనని స్వామికి తలంపు కలిగింది. వెంటనే విష్ణుచిత్తుల స్వప్నంలో సాక్షాత్కరించి రేపటి రాజ్యసభకు వెళ్ళి, శ్రీమహావిష్ణువే పరతత్వమని, మోక్షప్రదాతను నేనే అని నిరూపించిరమ్మని ఆజ్ఞాపించారు. విష్ణుచిత్తులు మాత్రం స్వామి నాకు మాలలు కట్టుట, పూలు కోయుట దక్క వేరేమి తెలియదనిరి. భగవానుడు వాత్సల్యంతో రేపు నీవు రాజ్యసభకు వెల్తున్నావు, గెలుస్తున్నావు అంతే, అని అదృశ్యమైనారు. అలా అభయమిచ్చి రాజ్యసభకు పంపారు. సభాభవనం ప్రవేశించిన విష్ణుచిత్తుని రాజు ఎదురుగావచ్చి, నమస్కరించి, ఉన్నతాసనంపై కూర్చోపెట్టారు.

శ్రీపతి, విష్ణుచిత్తునిలో ఆవేశించి ఉండుటచే రాజుకు ధనపు మూట పడగొట్టగలవాడు అనే నమ్మకంతో వాదన ప్రారంభించమంటాడు రాజు. విష్ణుచిత్తులు వాదనకు సిద్ధమై లేచి నిలబడి వేదసూక్తులు, ఉపనిషద్వాక్యాలు, ఆరణ్యక బ్రాహ్మణాల ప్రమాణాలు, సాధికారకంగా, సోపత్తికంగా, నారాయణుడే పరబ్రహ్మమని నోళ్ళు మూత పడేలాగ నారాయణతత్వ నిరూపణచేశారు విష్ణుచిత్తులు. మహా ఆశ్చర్యంగా శుల్కంగా ఉంచిన ధనంమూట పైనుండి క్రిందికి ఊడిపడగా రాజు పరమానందంతో జై విష్ణుచిత్తా! అన్న జయజయ ధ్వానాలతో ఉరేగింపుకు ఏర్పాటుచేశారు. గజవాహనంపై పురవీధుల గుండా వెంట జనం నడుస్తున్నారు. నభూతో నభవిష్యతిగా సాగుతోంది. శ్రీవైకుంఠంలోని స్వామి గరుడవాహనంపై భూలోకానికి వచ్చి అందరికీ దర్శనమిచ్చారు. స్వామిని చూచిన విష్ణుచిత్తులు. ఏనుగు మెడకు అటూ ఇటూ కట్టిన గంటలు తాళాలుగా చేసుకుని, పల్లాండు పల్లాండు అంటూ మంగళం పాడారు విష్ణుచిత్తులు. స్వామిని దర్శించి పాడిన పల్లాండుకు ప్రీతి చెందినవాడై ద్రవిడప్రబంధ పారాయణకు ముందుగా అనుసంధానం ఈ పల్లాండుతోనే, ప్రారంభమవ్వాలని వరమిచ్చినారు స్వామి. అంతటి గొప్ప ఆళ్వార్లవంటి, భక్తి నాకు లేదు కదా ఆచార్యదేవా అంటారు పెణ్పిళ్ళైగారు. ★

# జీవుడు కర్మను స్వతంత్రుడై చేస్తాడా?

## లేక పరమాత్మే జీవుడిచేత అన్నికర్మలనీ చేయిస్తాడా?

(శ్రీమాన్ పుత్తూర్ కృష్ణమాచార్యస్వామివారి వ్యాఖ్యానానుసారంగా చెప్పబడినది)



**శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు**

సర్వప్రవృత్తులలోనూ చేతనుడి ప్రథమప్రయత్నాన్ని అపేక్షించి పరమాత్మ ప్రవర్తింపచేస్తూంటాడు” అని దీపప్రకాశంలో వాదికేసరిజీయరే అర్థాన్ని సాయించేరు. శ్రుతప్రకాశికాచార్యులు ఈ శ్లోకానికి ప్రసాదించిన అర్థానికీ, వాడికేసరిజీయర్ సాయించిన అర్థానికీ చిన్న భేదం ఉన్నది. ఒక్కొక్క కార్యాన్ని ప్రారంభించేటప్పుడున్నూ ఈశ్వరుడు ప్రసాదించిన స్వాతంత్ర్యశక్తితో మొదటి క్షణంలో (పరమాత్మచేత నిలబెట్టబడనవసరం లేకుండా) తనంతట తానే జీవుడు పుణ్యకార్యాలలోనో, పాపకార్యాల లోనో జ్ఞానేచ్ఛాప్రయత్నాలను చేస్తాడు అనే శ్లోకపూర్వభాగానికి అర్థం చెప్పటంలో ఇద్దరు ఆచార్యులకీ అభిప్రాయభేదం లేదు. ఉత్తరార్థానికి ఆవిధంగా మొదటి ప్రయత్నాన్ని జీవుడు చేస్తున్నప్పుడు పరమాత్మ వాడిని నిలపకుండా ఉదాసీనుడై ఉంటాడు. రెండవక్షణం నుంచీ, చెయ్యబడే ప్రయత్నాలలో పుణ్యపాపకర్మలు రెండింటినే ఆ మొదటి ప్రయత్నాన్నను సరించి అనుమతించే వాడిగా పరమాత్మ నిలబెడతాడు. ఈ విధంగా ప్రథమక్షణంలో ఇచ్చిన స్వాతంత్ర్యంవల్ల కర్మని ప్రారంభించటమే కారణంగా పాపకర్మలకి నిగ్రహాన్నీ, పుణ్యకార్యాలకి అనుగ్రహాన్నీ ప్రసాదించి వాటికి క్రమంగా దుఃఖసుఖములను ఫలములుగా పరమాత్మ సమస్తజీవులకీ ప్రసాదిస్తున్నాడు” అన్నది శ్రుతప్రకాశికాచార్యులవారిప్రకారం అర్థం.


అదే ఉత్తరార్థానికి ఆవిధంగా ప్రథమప్రయత్నంలో జీవుడు స్వాతంత్ర్యంతో పుణ్యపాపకార్యాలని ప్రారంభించి నప్పుడు రెండవక్షణంనుంచీ పాపకర్మలను చివరిదాకా నిలబెట్టటం చెయ్యకుండా ఉపేక్షించే ఉంటాడు పరమాత్మ. పుణ్యకర్మలని రెండోక్షణంనుంచీ అనుమతిస్తూ నిలబెడుతాడు. ఈవిధంగా ప్రథమక్షణంనుంచీ చివరివరకూ స్వతంత్రుడు గానే కర్మచేస్తాడు గనుక పాపకర్మల విషయంలో జీవుడిని నిగ్రహిస్తూ దాని ఫలంగా దుఃఖాన్ని కలిగిస్తాడు పరమాత్మ. పుణ్యకర్మల విషయంలో ప్రథమక్షణంలో స్వతంత్రుడుగా కర్మచేసినందున అనుగ్రహాన్నీ, దాని ఫలంగా సుఖాన్నీ పరమాత్మ కల్పిస్తాడు అన్నది వాదికేసరి జీయర్ అభిప్రాయాన్ననుసరించిన అర్థం. “పుణ్యమైనా, పాపమైనా మొదటి క్షణంలో మాత్రమే పరమాత్మ తన ఇష్టప్రకారం జీవుడికి స్వాతంత్ర్యం ఇస్తున్నాడు గనుక ఆ ఒక్కక్షణంలోనే పరమాత్మయొక్క విశేషకారణత్వానికి సంకోచం చెప్పుకోవాలి. ద్వితీయక్షణంనుంచీ జీవుడి పుణ్యపాపకర్మలన్నింటి విషయం లోనూ సామాన్యకారణత్వంతో నిలబెట్టటం అనే విశేష కారణత్వంకూడా పరమాత్మకి ఉన్నది” అన్నది శ్రుత ప్రకాశికాచార్యులవారి అభిప్రాయం. “పాపకర్మవిషయంలో రెండవక్షణంనుంచీ ఉన్న ప్రయత్నాలలోకూడా పరమాత్మ జీవుడిని నిలబెట్టటం ఆయన కరుణకి లోటుని ఆపాదిస్తుంది గనుక, ఆ కర్మవిషయంలో మొదటినుంచి చివరిదాకా పరమాత్మకి ప్రారంభించినవాడిని నిలబెట్టటం అనే విశేషకారణత్వం లేదని గ్రహించినందువల్ల దోషం ఏమీ లేదు.” అని వాదికేసరిజీయరువారి అభిప్రాయం. “పుణ్యకర్మవిషయంలో ప్రథమప్రవృత్తిలో పరమాత్మ ఉపేక్షించే ఉంటాడు గనుక, అతడికి విశేషకారణత్వం లేదు. రెండవక్షణంనుంచి మొదలు పెట్టినదాన్ని నిలబెడు తున్నాడు గనుక విశేషకారణత్వం ఉన్నది” అన్నదే ఇద్దరు ఆచార్యుల అభిప్రాయమున్నూ. ఈ విషయంలో శ్రీవేదాంతదేశికుల అభిప్రాయం పూర్తిగా భిన్నం. పరాయత్తాధికరణంగురించిన అధికరణసారావళిలో కూడా ప్రకృతమైన (గీత–18–14,15) శ్లోకాల గీతాభాష్యతాత్పర్యచంద్రికలో వారు ఇలా ప్రకటించి యున్నారు. అందులో ఇలా ఉన్నది. పరమాత్మ జీవుడికి తన సంకల్పంచేత కలిపించిన ప్రవృత్తి శక్తుల శరీరేంద్రియములను క్రియాపరత్వానికి మూలంగా ఇచ్చేడు. అన్నికార్యాలలోనూ ప్రారంభ ప్రయత్నాలకిన్నీ, ప్రయత్నం లోంచి నివృత్తికీ అనుగుణంగా తన స్వరూపంచేతనూ, సంకల్పంచేతనూ (భూమిలాగ) అందరినీ నిలబెట్టియున్నాడు. ★

ˆ సంప్రదాయసేవలో

# మనస్విని (మా ) ప్రచురణలు



శ్రీమాన్ శ్రీ కోయిల్ కందాడై వేంకట లక్ష్మణ స్వామి



అంగుళం అంత బీజంలో మహావృక్షం ఇమిడి ఉన్నట్లు. మంచి భావనలకు నాంది పడిన శుభ ఘడియ అభ్యుదయానికి మూలమైనట్లు గొప్ప సంకల్పముతో ప్రారంభమై నేడు శాఖోపశాఖలుగా విస్తరిల్లినది మనస్విని (మా) ప్రచురణలు. మనస్వినిపబ్లికేషన్స్ అనేక విషయ విజ్ఞాన విశేషాలకు అక్షర రూపాన్ని కల్పించి, అనేక పుస్తకాలుగా ముద్రించి శాశ్వత రూపాన్ని కలిగిస్తున్నది. సంకల్పం ఉంటే ఆధ్యాత్మిక రంగంలో ఏ రకంగా అయినా సేవ చేయవచ్చును. పుస్తక ప్రచురణ అనేది ఒక జ్ఞాన యజ్ఞం వంటిదని ప్రవచిస్తారు.

గొప్ప ప్రేరణతో శ్రీమాన్ కోయిల్ కందాడై వెంకట సుందరాచార్యులచే స్థాపింపబడి వారి కుమారులైన కోయిల్ కందాడై వెంకట లక్ష్మణస్వామి వారి చేత మనస్విని ప్రచురణలు నిర్వహింపబడుతూ అనేక ఆధ్యాత్మిక గ్రంథాలను సమాజానికి అందిస్తున్నది. సంస్థ స్థాపకులైన శ్రీమాన్ వెంకటసుందరాచార్యులు వృత్తిలో ప్రవృత్తిలో సంస్కృత అధ్యాపకులై పండితులై




పలువురు శిష్యులకు గొప్ప జ్ఞానాన్ని అందించారు. అలాగే వారి కుమారులైన కోయిల్ కందాడై వెంకట లక్ష్మణ స్వామి వారిని కూడా సంప్రదాయ విషయాలలోనూ భాషా పాండిత్యంలోనూ గ్రంథ పరిష్కరణ ముద్రణలలోను సర్వ సమర్థులుగా తీర్చిదిద్దారు.

శ్రీమాన్ లక్ష్మణ స్వామి వారుకూడా పండితుల ద్వారా వేద ఇతిహాస పురాణ ప్రబంధ ఆగమ విషయాలను విని ఆకర్షితులై గ్రంథముద్రణలకు శ్రీకారం చుట్టారు. తండ్రి గారితో ఉత్సవాది కార్యక్రమములలో పాల్గొంటూ పండితుల మధ్య జరిగే శాస్త్రచర్చల్లో పాల్గొనటం కూడా గొప్ప ప్రేరణగా మారింది.

"శ్రీ వైష్ణవ ఆలయాలలో వాహనోత్సవ వైభవం" అను ప్రథమ గ్రంథం ప్రచురణకు అదే నాంది అయింది. అలాగే వారి ఇంట్లో గల విలువైన పూర్వగ్రంథాల పునర్ముద్రణ ప్రారంభించారు. క్రమంగా కొన్ని సంస్కృత గ్రంథాలకు అనువాదంగా తాత్పర్య ముద్రణలు గావించవలసి వచ్చింది. తండ్రిగారి మార్గదర్శనంలో పరిశీలనలో అనేక గ్రంథాలను ముద్రించడం కొనసాగింది. 2002లో శ్రీమాన్ డా॥ న.చ.రఘురాఘునాథాచార్య స్వామివారి పరిచయంతో సుప్రసిద్ధ పండితుల పరిచయాలతో సహృదయుల ఆర్థిక ప్రోత్సాహంతో వారి తండ్రిగారి మంగళా శాసనాలతో (మిగతా 28 వ పేజీలో)





# తెలుసుకోవలసినవి మూడే!



**శ్రీమాన్ శ్రీ వంగల వెంకటాచార్యులు**

(క్రిందటి సంచిక తరువాయి)

లోకములో ఏదైనా వస్తువు తన యజమానికి ఎట్లు కావాలంటే అట్లు వినియోగ పడుచున్నది కదా! అలాగే ఈ ఆత్మకూడా పరమాత్మకు వినియోగ పడుతుందా లేదా ఏమైనా తేడా ఉన్నదా అంటే? ఆవస్తువులు యజమానికి తన ఇష్టమునకు అనుగుణముగా ఉపయోగపడడానికీ ఈఆత్మ భగవానునికి ఉపయోగ పడడానికి కొంత తేడా ఉన్నది. ఆతేడా ఏమిటో మనం చూద్దాం.

మామూలుగా లోకంలో ఉండే వస్తువులైన ఇల్లు, పొలము, భార్యా, పిల్లలు, యజమానియైన ఆవ్యక్తికంటే వేరుగా ఉంటున్నాయి. యజమానియైన వ్యక్తికి ఒక శరీరమువలె కాక వేరుగా ఉంటున్నాయి కదా! అట్లు వ్యక్తికంటే ఆయా వస్తువులు వేరుగా యుండుట మనకు స్పష్టముగానే తెలుయుచున్నది. ఇల్లు, పొలము, భార్య పిల్లలు యజమానియైన ఆ వ్యక్తితో చేరి ఉండక పోవడమేకాక ఆవ్యక్తి లేనప్పుడు కూడా ఉంటున్నాయి. ఆవ్యక్తి మరణించిన తర్వాత వేరొక వ్యక్తికి చెందుచున్నాయి. అంతేకాక ఆ ఇల్లు పొలము మొదలగునవి ఎవరు వినియోగించుకుంటే వానికి ఉపయోగపడుతూ అనేకమందికి శేషముగా ఉంటున్నాయి. అలాగే భార్య పుత్రులు కూడా.

కానీ ఈ ఆత్మ, ఇల్లు, పొలము, భార్యా,పిల్లలు వలె యజమానికంటే వేరుగా కాక పరమాత్మకు శరీరముగా ఉండును. ఎట్లనగా ఆజీవాత్మ లోపలే పరమాత్మ అంతర్యామిగా వేంచేసియుండును. కనుక జీవుని లోపల నుండే పరమాత్మకు పైననుండే ఈ జీవుడు శరీరముగానూ ఆపరమాత్మ శరీరిగాను వేరుచేయుటకుగానీ, వేరుగా చూచుటకు కానీ వీలులేకుండా యుండును.

దీనినే స్వామి ఎంబెరుమానార్ ఈ ఆత్మలక్షణములు తెలుపుతూ **అయమేవ ఆత్మా శరీరభావః, పృథక్ సిద్ధ్యనర్హా2ధారా2ధేయభావః, నియన్తృనియామ్య భావః, శేషశేషిభావశ్చ** అనగా ఈ ఆత్మకు పరమాత్మకు ఉండు సంబంధము శరీర శరీరి సంబంధమువలే వేరుగా ఉండుటకు వీలులేనిదై పరమాత్మను ఆధారముగా కలిగినదై తాను ఆధేయమై, పరమాత్మచేత నియమింపబడుచు మరియు పరమాత్మ యజమానిగా తాను శేషముగా (సేవకునిగా) నుండును అని తెలిపిరి.

వేదము కూడా "యస్యాత్మా శరీరమ్" ఎవనికి(ఏపరమాత్మకు) ఆత్మ శరీరమో మరియు "యస్యాక్షరం శరీరం" ఎవనికి (ఏపరమాత్మకు) నాశములేని ఆత్మ శరీరమో అని తెలిపినది. కనుక ఆత్మ పరమాత్మకు శరీరమువలె యుండును అను విషయము స్పష్టముగా తెలియుచున్నది కదా! దీనిని బట్టి ఆత్మ పరమాత్మకు శరీరముగాయుండునని మరియు పరమాత్మ ఆత్మకు శరీరిగాయుండునని తెలియుచున్నది.

ఇక్కడివరకు ఆత్మయొక్క స్వరూపమును పరీక్షచేసి ఆత్మ స్వరూపమును నిరూపించి చూపించిరి. ఇక పై పైన నిరూపించిన ఆత్మకు అచిత్ (ప్రకృతి) సంబంధం అనాదిగా యున్నదియని తెలుపుచున్నారు. అంతేకాక ఈ అచిత్ సంబంధమువలన మరియు ఆ అచిత్ సంబంధము లేనపుడు ఆ అచిత్ సంబంధం తొలగినపుడు ఉండే చేతనుల (ఆత్మల) స్వరూపమును తెలుపుచున్నారు. ఈ ఆత్మనే చేతనుడు అనికూడా పిలుస్తారు.

ఈచేతనులందరూ ఒకే రకంగా ఉంటారా అంటే లేదు ఈ చేతనులు మూడు రకాలుగా ఉంటారని చేతన త్రైవిధ్యమును చూపించుచున్నారు పిళ్ళైలోకాచార్యులవారు. ఆమూడు రకాల చేతనులు ఎవరనగా 1) బద్ధులు. 2) ముక్తులు మరియు 3) నిత్యులు. వీరివివరము వరుసగా తెలుసుకుందాం.

బద్ధులనగా సంసారమునందు పరమాత్మచే బంధింపబడిన చేతనులు అనగా అనాదిగా అచిత్ సబంధమును కలిగి సంసారములో అనేక జన్మలెత్తుతూ అలమటిస్తూ ఉండేవారు. వీరే సంసారులు.

ముక్తులనగా సంసార సంబంధమును తెంపుకున్నవారు. వీరు సంసారములోనుండి మోక్షమునందు రుచికలిగి, ఆమోక్షమునకు ఆటంకముగానుండు పుణ్యపాపరూప కర్మలను అనుభవించుట చేతగానీ, ప్రాయశ్చిత్తముద్వారా

గానీ, ఆయా కర్మలను తొలగించుకొనుటద్వారా గానీ, లేదా యాదృచ్ఛిక పుణ్యముచేత గానీ ఆకర్మలు నశించును. వానికి ఆకస్మికముగా భగవత్కటాక్షము కలుగును. అట్లు కలిగిన భగవత్కటాక్షముచేత వీనికి రజోగుణము తమోగుణము అణగి సత్వగుణము బాగా వృద్ధిపొందును. ఆసత్వగుణము వల్ల వీనికి మోక్షమునందు ఆసక్తి కలుగును. ఆమోక్షమునందు ఆసక్తితో సదాచార్యుని ఆశ్రయించును. ఆ ఆచార్యోపదేశమువలన పరాత్పరుడైన శ్రీమన్నారాయణుని విషయమైన జ్ఞానము కలుగును. దానికనుగుణముగా తన వర్ణమునకు తన ఆశ్రమమునకు (బ్రహ్మచర్యాశ్రమ, గృహస్థాశ్రమ, వానప్రస్థాశ్రమ మరియు సన్యాసాశ్రమము) అనుగుణమైన కర్మను ఫల సంగ కర్తృత్వములను వదలి భగవదర్పణ బుద్ధితో ఆచరించును. దానివల్ల వీనికియున్న ప్రాచీన కర్మలన్నీ నశించి పరమాత్మయందు భక్తిపుట్టును. దానివల్ల పరమాత్మ వీనిని కటాక్షించి తన నిర్హేతుకమైన (ఎట్టికారణములేని) కృపతో వీని సకల దోషములను తొలగించి వీనికి తన పాదారవిందములయందు విశ్వాసము పుట్టించి తద్వారా స్వామి చరణములలో శరణాగతి చేయునట్లు చేయును. తద్వారా సంసారమును పూర్తిగా తొలగించి వీనిని మరల తిరిగి వచ్చుటకు వీలులేని తన దివ్యధామమైన శ్రీవైకుంఠమునకు చేర్చును. అట్లు భగవత్కటాక్షముతో శ్రీవైకుంఠమునకు చేరిన వానికి ముక్తుడు యని పేరు.

ఇక మూడవవారైన నిత్యులు ఎవరంటే? అసలు సంసారమంటే ఏమిటో తెలియని సంసార గంధము (వాసన) అంటనివారు. ఒకరోజుకూడా సంసారములోయుండని వారు అనుటచే వీరు ముక్తులకన్నా వేరైనవారు వారిని మించిన వారు యని అర్థం. వీరికే అస్పృష్ట సంసార గంధులు అని పేరు. అనగా అసలు సంసారము యొక్క వాసనేకూడా అంటనివారు అని అర్థం.

ఇంతకు మునుపు ఆత్మ లక్షణములను తెలుపునపుడు “నిత్యమాయ్” ఆత్మ నిత్యము యని తెలిపితిరి కదా! కనుక సకలాత్మలు నిత్యులే కావాలి కానీ కొన్ని బద్ధులు కొన్ని ముక్తులు కొన్ని నిత్యులు అగుట ఎట్లు కుదురుతుంది. అను ప్రశ్న వచ్చినది కదా! అది ఎట్లో తర్వాత తెలుసుకుందాం....

(మరికొంత వచ్చే సంచికలో తెలుసుకుందాము)

★

## మనస్విని (మా ) ప్రచురణలు

(26 వ పేజీ తరువాయి) అనేక గ్రంథాలను ముద్రించారు. ఇప్పటి వరకు 63 ధర్మశాస్త్ర సంప్రదాయ గ్రంథాలను మనస్విని (మా) ప్రచురణలు సమాజానికి అందించాయి. చెదలు పట్టి జీర్ణమైన గ్రంథాలు, తెలుగులో అమూల్యమైనవి, సమాజానికి నిరంతరం ఉపయోగపడే గ్రంథాల ప్రచురణ కొనసాగుతున్నది. పండితులు ప్రవచించే ధర్మశాస్త్ర సంబంధమైన విషయాలు, పుస్తకాల పేర్లు మొదలగు వాటిని ఆధారంగా చేసుకుని గ్రంథముద్రణ జరుగుతున్నది. 1981 1985 వరకు డాక్టర్ గోపాల్ రావు గారి మనసా ప్రింటర్స్ హిమైత్‌నగర్‌లో సూపర్వైజర్ ప్రూఫ్‌రీడింగ్ మొదలగు కార్యనిర్వహణ వలన లక్ష్మణస్వామి వారికి కలిగిన అనుభవంతో 2009 నుండి గ్రంథ ప్రచురణా రంగంలో స్థిరపడి మనస్విని (మా) ప్రచురణల పేరుతో ఆధ్యాత్మిక ధార్మిక వైదిక సంబంధ పుస్తకాల ప్రచురణకు దోహద పడింది. అనేక స్తోత్ర గ్రంథాలు, వైదిక ఆగమ సంహితలు ధర్మశాస్త్ర గ్రంథాలు వీరి ప్రచురణల ద్వారా ముద్రించ బడుతున్నాయి. అనేక మంది ప్రత్యేక రోజులలో గుర్తుగా బహుమానంగా భగవత్ స్తోత్రంకానీ గ్రంథం కానీ వీరి ద్వారా ముద్రింప చేయటం అనే ఒక గొప్ప సంప్రదాయం కొనసాగుతున్నది

★





# ఋషి వాక్య ప్రబోధాలు



శ్రీమాన్ శ్రీ డా.యం.టి.ఆళ్వార్ స్వామి

**ఉత్థానతః స్మృతిమతః శూచి కర్మణో నిశమ్య కారిణః।**
**సంయతస్య ధర్మజీవినో అప్రమత్తస్య యశోభివర్ధతే॥**

ఎవడు ప్రయత్నశీలునిగా ఆలోచించుచూ, మనోవాక్కాయ కర్మలలో శుద్ధి కలిగి, పూర్వాపర్వములు చక్కగా ఆలోచించి పనులుచేస్తూ తనయింద్రియాలను వశంలో ఉంచుకొని, ధర్మ బద్ధంగా జీవితాన్ని గడుపుతుంటాడో అజాగ్రత్త లేనివాడుగా ఉంటాడో అట్టి వాని కీర్తి, సంపద, రోజురోజుకూ వృద్ధి చెందుతాయి. (బౌద్ధఋషి)

**తైత్తీరీయ ఉపనిషత్ ప్రబోధాలు**
**వేదమనూచ్యాచార్యో అంతేవాసినమనుశాస్తి**
**సత్యం వద ధర్మం చర**
**స్వాధ్యాయాన్ మా ప్రమదః।**
**ఆచార్యాయ ప్రియం ధనం ఆహృత్య**
**ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః॥**

వేదమును నేర్పిన తరువాత గురువుగారు తమ శిష్యుని ఇలా ఆజ్ఞాపించుతాడు. సత్యమునే పలుకుము. ధర్మమునే అనుష్టింపుము. వేదాధ్యయనమును అశ్రద్ధచేయకుము. గురువు గారికి ప్రియమైన గురుదక్షిణను ఇయ్యుము. సంతతి అనే దారమును త్రెంపకుము. అనగా పెండ్లిచేసుకుని సంతతిని పొందుము. నీతో సంతతి సమాప్తము కానీయకుమా!

**సత్యాన్న ప్రమదితవ్యం।** సత్యమార్గములో పొరబడవద్దు.

**ధర్మాన్నప్రమదితవ్యం।** ధర్మమార్గములో పొరబడకుము.

**కుశలాన్న ప్రమదితవ్యం।** నేర్పరితనములో పొరబడకుము

**భూత్యైన ప్రమదితవ్యం।** అభ్యుదయ మార్గములో పొరబడకుము

**స్వాధ్యాయ ప్రవచనాభ్యాం నప్రమదితవ్యమ్।** వేదమును చదువుట యందు, చదివించుట యందు పొరబడకుము.

**దేవ పితృకార్యాభ్యాం నప్రమదితవ్యం।** దేవతలకు పితృదేవతలకు చేయు కార్యక్రమాలలో పొరబడవద్దు.

**మాతృదేవోభవ।** తల్లినిదైవముగా కలిగి ఉండుము

**పితృదేవోభవ।** తండ్రిని దైవముగా కలిగి ఉండుము

**ఆచార్యదేవో భవ।** గురువు దైవమని తెలుసుకో!

**అతిథి దేవోభవ।** అతిథిని దైవముగా తెలుసుకో

**యాని అనవద్యాని కర్మాణి తాని సేవితవ్యాని** నిందలేని పనులని ఏవి ప్రసిద్ధముగా ఉన్నవో వానినే ఆచరింపుము.

**నోఇతరాణి।** తక్కిన వాటిని ఆచరింపకుము.

**యాని అస్మాకగ్ం సుచరితాని తాని త్వయా ఉపాస్యాని** గురువులలో గల సత్ప్రవర్తనములు ఏవి గలవో వాటిని మాత్రమే అభ్యసించుము.

**నోఇతరాణి।** తక్కినవాటిని అభ్యసించవలదు.


**మం॥ సర్వతః పాణిపాదన్త త్సర్వతో2క్షి శిరోముఖమ్।**
**సర్వతః శ్రుతిమల్లోకి సర్వమావృత్య తిష్ఠతి**

ఆ శ్రీహరిని విశ్వమంతటా హస్తపాదములు గలిగి ఉన్నవాడని, నేత్రములు శిరస్సులు మరియు ముఖములు గలవాడని, ఈ విశ్వమందలి సమస్త శబ్దములను వినుచున్నాడని, ఇట్లు ఆ విశ్వమంతా వ్యాపించి ఉన్నాడని తెలుసుకుని మంచి పనులనే చేయండి. పాపపు పనులు చేయుటకు భయము కలిగి ఉండవలయును. అని వేదవాక్యము. (నారాయణ అనువాకము–16వ వాక్యము)

శ్లో॥ ప్రథమం దేహశుద్ధ్యర్థం ద్వితీయ మాత్మ శుద్ధికమ్।
తృతీయం మోక్ష సిద్ధ్యర్థం సాలగ్రామ జలం పిబేత్॥

దేవాలయములలో అర్చకులు పెద్దలు సాలగ్రామ తీర్థమును మూడుమారులు తీర్థమును ఇచ్చెదరు. ఎందుకనగా మొదటి సారి తీర్థము దేహశుద్ధిని, రెండవ సారి ఇచ్చునది ఆత్మశుద్ధిని, మూడవసారి ఇచ్చునది మోక్షమునకు యోగ్యతను కలిపించును. తీర్థమును జుఱ్ఱ కూడదు. శబ్దములేకుండా తీసుకొనవలెను. (శ్రీవైష్ణవ ఆగమములు).

# వానమామలై దివ్య చరిత్ర



**శ్రీమతి వనం ఉషారాణి**

(గత సంచిక తరువాయి) ఉత్తరదేశపు రాజైన గుణశీలుడు ఒకనాడు ఒంటరిగా వేటకు వెళ్ళి దారితప్పి దారికోసం వెతుకుతూ అలసిపోయి ఆకలితో తిరుగుతుండగా ఒక గుడిసె కనిపిస్తుంది. ఆ గుడిసె లోపల ఎవ్వరూ కనిపించరు కానీ సాపాటు మాత్రం తయారుగా ఉంటుంది. ఆకలిగొన్న రాజు దానిని భుజించాడు. గుడిసెలో వారు ఇంటికి వచ్చేసరికి సాపాటంతా ఏమీ మిగలకుండ గిన్నెలన్నీ ఖాళీగా కనపడేసరికి "విష్ణుమూర్తి ఆరాధనకు పెట్టవలసిన భక్తితో వండిన వంటకాలు తిన్నందుకు కుక్కగా మారిపోతావని రాజుని శపిస్తారు. అప్పుడా రాజు వారి పాదాలపై పడి శాప విమోచనం కోసం ప్రాధేయపడతాడు. అప్పుడు ఒక వేటగాడు ఆ కుక్కను తోతాద్రికి తీసుకువెళ్ళి సేతుతామరై సరస్సులో స్నానం చేసినప్పుడు తిరిగి స్వీయరూపం దాల్చి పరమపద ప్రాప్తి లభిస్తుందని చెప్తారు. శాపం పొందినందుకు పరమపదం పొందే యోగ్యత దక్కిందని సంతోషించినాడు. చాలా కాలం తరువాత ఒక వేటగాడితో వెళ్ళి సేతుతామరైలో స్నానమాడి వానమామలై స్వామికి నమస్కరించి వేటగాడూ, కుక్క రూపంలోనున్న రాజు ఇద్దరూ మోక్షం పొందినారని చరిత్ర.

ఇట్లా శాపవిమోచనం ఇచ్చిన సేతుతామరై సరస్సు యొక్క మహిమ వ్రాయడం చాలా కష్టతరం. మూడున్నర కోట్ల పుణ్యనదులు ఈ భూలోకంలో ఉన్నాయి. వాటిలో గంగా యమునా నర్మదా మొదలగు ముఖ్యనదులన్నీ వాటి పాపం పోగొట్టుకొనుటకు ఇక్కడ సేతుతామరైలో కలుస్తాయి. అందుకే ఇక్కడ స్నానమాచరిస్తే అన్ని పుణ్యనదులలో స్నానమాచరించిన ఫలితం దక్కుతుంది. ఈ సేతుతామరై సరస్సు ఒక చిన్న సముద్రం లాగా కనబడుతుంది కానీ ఆ నీరు రుచి చాలా తియ్యగా ఉంటుంది. చాలా మంది భక్తులు నూనెబావిలో నూనె పెట్టుకుని, సేతుతామరైలో స్నానం చేసి ప్రసాదం సేవించి వారి వ్యాధులన్నీ పోగొట్టుకుని తమ పేరు మార్చుకుని దైవనాయక, వానమామలై, తోతాద్రి అని పేరు పెట్టుకుంటారు. వానమామలై సంస్కృత పేరే తోతాద్రి. స్వామివారి పేరు కూడా తోతాద్రే. ఊరి పేరు వానమామలై. కారి మహారాజు వచ్చి నాలుగు వైపులా ఉన్న నీరుతో సరస్సు చేసినాడు కనుక నాంగునేరి (అంటే తమిళంలో నాలుగు వైపులా ఉన్న సరస్సు) అని పేరు వచ్చింది. నమ్మాళ్వార్లు తాయారు పేరుతో శ్రీవరమంగళనగర్ అనే ముద్దుపేరు పెట్టి సంబోధించినాడు. నమ్మాళ్వార్లు మొదట శరణాగతి ఇక్కడే చేసినాడు. ఇక్కడ శఠారిపై భగవంతుని పాదాల క్రింద నమ్మాళ్వార్ల విగ్రహం ఉంటుంది.

"ఏనమాయ్ నిలన్కీండ ఎన్నప్పనే కణ్ణా, ఎన్రుమ్ ఎన్నై ఆళు దై" అని నమ్మాళ్వార్లు వానమామలైపై వ్రాసిన తిరువాయిమొళి పాశురం.

స్వామివారి కృపకు పాత్రుడైన నమ్మాళ్వార్లు ఏం కావాలో కోరుకోమంటే "మీకు శరణాగతి తప్ప నాకు మరేమీ వద్దు. అది కూడా మీ కృపయే. వృత్తము, బుద్ధి, ఆత్మ కూడా మీదే. మంచి బుద్ధి, భక్తితత్పరత మీరు ఇచ్చినవే. మీకు ఇవ్వడానికి నావద్ద ఏమున్నది కనుక? మీకోసం పాశురాలు వ్రాసేలా కూడా మీరే అనుగ్రహించినారు. జ్ఞానితో వివేకి కలిసి ఉండాలని వీరు వానమామలైలో ఉన్నారు. నాకు చేసిన కృప మీకు అదనపు భారం. మీరు పరమపదనాథుడిగా ఉన్నప్పుడూ కూడా భక్తుని కాపాడాలని సిద్ధంగా ఉన్నారు. కోరికలన్నీ నెరవేరుస్తున్నారు. నాకోసం ఒక్కసారి తిరుక్కురుగూర్‌లోని చింతచెట్టు దగ్గరకు వచ్చి కృప చేయండి స్వామీ" అని వేడుకుంటారు. దానికి సమాధానంగా పెరుమాళ్ళు "ఆళ్వార్! నేను వస్తున్నా" అని చెప్పి దర్శనం ఇచ్చినాడు.

"వందరుళి యెన్నింజిడమ్ కొణ్డ" అని వాత్సల్యంతో మోహితుడై తనకు దొరికిన ఈ భాగ్యం గురించి పాశురం వ్రాసి మనకు అనుగ్రహించినారు.

నమ్మాళ్వార్లు "వాణవర్ కోరిండు బంద అరుళనార్" అని వానమామలై గురించి కీర్తించిన పాటే చాలు ఈ స్వామివారే పరమపదనాథుడు అని తెలుస్తుంది.

(సశేషం) ★



# కీర్తనా మాధుర్యం



శ్రీమాన్ శ్రీ డా॥ వోలేటి రవికుమారాచార్యులు

శ్రియ:పతి, వైకుంఠనికేతనుడు, అనంతకళ్యాణ గుణాత్మకుడు, అఖిలహేయ ప్రత్యనీకుడు అయిన భగవాన్ శ్రీమన్నారాయణుడు జీవులను (చేతనులను) ఉద్ధరించుటకు తానే స్వయంగా అవతరించడమే కాకుండా ఋషులను, ఆళ్వార్లను మరియు వాగ్గేయకారులను కూడా అవతరింపజేసి ఎలాగైనా మనందరం భగవత్ వైభవాన్ని తెలుసుకొని ఆయనను చేరాలి అని పరితపిస్తూ ఉంటాడు. అటువంటి స్వామి యొక్క అనేక ప్రయత్నాలు కూడా ఆశించిన రీతిలో ఫలించకపోయినప్పుడు భగవంతుడు కూడా ఆచార్యుడిని ఆశ్రయించడం అనేది చరిత్రను పరిశీలిస్తే అనేక సందర్భాలలో మనకు గోచరం అవుతుంది. అందుకే సంప్రదాయంలో ఆచార్య స్థానం అంత విశిష్టమైనది. ఈ వ్యాసంలో పద కవితా పితామహుడు అని కీర్తింపబడే వాగ్గేయకారులు శ్రీ తాళ్లపాక అన్నమాచార్య స్వామి వారు రచించిన కీర్తనలలో ఆచార్య వైభవమును తెలిపే ఒక అద్భుతమైన కీర్తన మరియు దాని యొక్క విశేష అర్థాలను అనుభవించే ప్రయత్నం చేద్దాము.

కలియుగ దైవమైన శ్రీశ్రీనివాసుడిని ఈనాడు మనము ఊర్ధ్వపుండ్రములతో సేవించుకో గలుగుతుండటానికీ మరియు భగవంతుడిని చేరుకునే అనేక దారులు వివిధ మతముల విష ప్రచారములతో మూసుకొని పోయిన తరుణంలో మళ్లీ మనందరం ఆ భగవంతుడిని చేరుకొనుటకు విశాల మార్గమును ఏర్పాటు చేసిన విశ్వ గురువులు భగవద్రామానుజులు. అట్టి రామానుజుల వైభవాన్ని అన్నమాచార్యుల వారు లోకానికి గొంతెత్తి చాటిన కీర్తనయే **గతులన్ని ఖిలమైన** అనే కీర్తన. ఈ కీర్తనలోని మాధుర్యమును, అంతరార్థములను తెలుసు కుందాం. భగవత్ వైభవ వర్ణన అసాధ్యం అని శాస్త్రాలు చెపుతున్నాయి. ఒకవేళ అది సాధ్యం అయితే కావచ్చు గాక, కానీ ఆచార్య వైభవం వర్ణించుట మాత్రం అంతకుమించిన అసాధ్యం అని సంప్రదాయస్థుల అభిప్రాయం. అందుకే సాహసము అనే పద ప్రయోగము గమనార్హం.

**గతులన్ని ఖిలమైన కలియుగమందును।**
**గతి ఈతడే చూపె ఘన గురుదైవము॥**

మార్గములన్ని శిథిలమైన, ఈ కలియుగమందును, భగవంతున్ని చేరుకునే మోక్ష మార్గాన్ని ఈ రామానుజులే చూపించెను. ఘన గొప్పదైన కీర్తితో ప్రకాశించిన విశ్వ గురువులు దైవ సమానులు భగవత్ రామానుజులు.

విశేష అర్థము: గతి అంటే మార్గము అని అర్థము మరి దేనికి మార్గం? అనే ప్రశ్న ఉదయిస్తే భగవంతుని చేరుకొనుటకు మార్గము. అంటే మోక్షము.

కృత, త్రేతా, ద్వాపర యుగములు ముగిసిన పిదప ప్రస్తుతము నడిచే ఈ కలియుగంలో భగవంతుని చేరుకునే మోక్షమార్గములన్నీ వివిధములైన అవైదిక, అశాస్త్రీయ మతముల విష ప్రచార విలయతాండవములతో శిథిలమై పోయాయి. "మతము" అంటే అభిప్రాయము లేదా దర్శనము అనిఅర్థం. భగవత్ రామానుజులు అవతరించుటకు పూర్వము ఎన్నో మతములు ప్రచారంలో ఉన్నాయి. కానీ అవన్నీ కూడా మన ఋషులు, ఆళ్వార్లు ఏ సిద్ధాంతాన్ని అయితే సశాస్త్రీయంగా ప్రతిపాదించారో అట్టి ప్రతిపాదనలకు విరుద్ధములై లోకులందరూ దిక్కుతోచని స్థితిలో ఉండగా ఆ పరాత్పరుడిని చేరుకొని బ్రహ్మానందమును పొందే మార్గములన్నీ శిథిలమయిన తరుణంలో, సంకోచించిన జ్ఞానం వికసించుటకు, మన మన పాపరాశి దగ్ధమవుటకు మరియు భగవంతుని చేరుకునే ఒక చక్కటి మార్గాన్ని (శరణాగతి) కృపచేయుటకు ఈ భూమండలంలో ఉదయించిన సూర్యుని వంటివారు భగవద్రామానుజులు. వారు గొప్పదైన కీర్తితో ప్రకాశించినటువంటి విశ్వ గురువులు మరియు మనందరిచేత దైవముగా కొనియాడబడదగిన వారు. ★

# స్టేషన్ ఘన్ పూర్ లోని తిరుమలనాథ దేవాలయం












తిరుమల నాథునిగా వేంచేసిన శ్రియఃపతి దివ్యదామం స్టేషన్ ఘన్ పూర్. శ్రియఃపతి శ్రీమన్నారాయణుడు అర్చావతారంగా వెలుగొందు క్షేత్రాలు అనేకం ఉన్నాయి. వాటిలో స్వయంవ్యక్తాలు కొన్ని మరికొన్ని మునులు, ఋషులు, భక్తాదులచే అర్చించిన క్షేత్రాలు. అలాంటి వాటిలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడు అనేక ప్రాంతాలలో భక్తులకి దర్శనమిచ్చి ఆలయం నిర్మించమని చెప్పినటువంటి క్షేత్రాలు అనేకం. అలాంటి క్షేత్రాలలో జనగాం జిల్లా స్టేషన్ ఘన్ పూర్ మండల కేంద్రంలో బస్ స్టాండ్ దగ్గరలో నున్న పెద్దారెడ్డి హిల్స్‌పై గల తిరుమలనాథస్వామి దేవాలయం.

ఆలయచరిత్ర పూర్వము సుమారు 1885-90 ప్రాంతములో నెల్లుట్ల వరవర రావు గారు అనే కరణం గారికి ఒక రోజు రాత్రి స్వప్నములో శ్రీ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారు సాక్షాత్కరించి, ఘనపురము గుట్టపై వెలసిన తనకు ఆలయము కట్టించ వలసినదిగ తెలిపి అంతర్ధాన మైనారు. స్వామి వారి ఆదేశానుసారం గ్రామ సేవకులను పురమాయించి, గ్రామ పట్వారి ఐన కలకోట రంగాచారి గారిని, మరికొంతమంది పెద్దలను పిలిపించుకొని స్వామి మూర్తికై వెతకడం ప్రారంభించారు. ఆప్రయత్నంలో త్రికోణాకారములోగల పెద్ద శిల సొరిగలో దివ్యమైన తేజస్సు చూసారు. ఒక్క వరవరరావు గారే చూశారు. అతి కష్టంగా లోపలికి ప్రవేశించి భగవంతుడిని స్తోత్రం చేస్తూ భగవన్ మూర్తిని దర్శించి ముకుళిత హస్తాలతో బయటకు వచ్చారు. మరుసటి రోజు ఆలయ నిర్మాణానికి పథకము వేయించి తిరుమలనాథుని మూల స్వామిని శ్రీఉడయవర్ల, ఆండాళ్ తల్లి, పన్నిద్దరు ఆళ్వారులను కూడా ప్రతిష్ఠించారు. ఆలయ ముఖ ద్వారాన్ని ఉత్తర దిశగా పెట్టించి ధ్వజస్థంభంను, గోపురముపై సుదర్శన చక్రాన్ని ప్రతిష్ఠించారు. ఆలయానికి నైఋతి భాగంలో శ్రీఆంజనేయ స్వామిని క్షేత్రపాలకునిగా ఏర్పరచారు. క్రమంగా దేవాలయాన్ని ఆలయాన్ని అభివృద్ధి పరిచారు.



**సేకరణ : కె.వి.జి.కృష్ణమాచార్యులు**

అలాగే ఉత్తర ముఖ మంటపము వెలమ దొరలు పొట్లపల్లి వంశస్తులు గ్రామస్తులైన చింతకుంట్ల నర్సయ్య గారు కలసి నిర్మించినారట. నాటినుండి కలకోట వంశస్థులు కలకోట నర్సింహాచార్యులు, కలకోట రంగాచార్యులు వంశపారంపర్య అర్చకులైనారు.

నిత్య ఆరాధనా కైంకర్యములకు గుట్ట కింద దేవాలయాన్ని నిర్మించారు. ప్రతి శనివారము గుట్టపైన విశేష కైంకర్యములు చేస్తున్నారు. కోరినకోరికలు తీర్చే కొంగు బంగారమైన స్వామికి నిత్యోత్సవములు, అధ్యయనోత్సవము, బ్రహ్మోత్సవములు ప్రత్యేక పర్వదిన ఉత్సవములు వైభవంగా





జరిపిస్తారు. ప్రతి బ్రహ్మోత్సవములో, అధ్యయనోత్సవములు జరుపుకొన్నప్పుడు ఇక్కడి పెరుమాళ్ళను గుట్టపైకి తీసుకువెళ్ళి ఉత్సవాల అనంతరం తిరిగి ఈ కోవెలలో వేంచేపు చేసుకొంటున్నారు. ఇప్పుడు ఈ సాంప్రదాయం కొనసాగుతున్నది. ప్రస్తుత స్థానాచార్యులు కలకోట రంగాచార్యులు, అర్చకులుగా కలకోట రామానుజాచార్యులు పూజాదికములు నిర్వహిస్తున్నారు.

## రేపాకలో బ్రహ్మోత్సవాలు



ప్రస్తుత సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలో శ్రీ ఉ.వే. శ్రీమాన్ తి.న.చ.సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి స్వామి వారి అధ్వర్యంలో పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి అమృతహస్తాలతో ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించుకొని దశమ బ్రహ్మోత్సవాలను అధ్యయనోత్సవ సహితంగా వైభవోపేతంగా నిర్వహించారు. యజ్ఞాచార్యులుగా తి.న.చ. అనంతాళ్వాన్‌స్వామి, బ్రహ్మగా విజయరాఘవన్‌స్వామి వారు, అర్చకులు విద్యాసాగర్ ఆచార్య, శ్రీనివాసాచార్య స్వామి వారు, తోయప్పన్ గారు, సింగరాచార్య స్వామి వారు ఋత్విక్కులుగా పాల్గొని ఉత్సవ కార్యక్రమాలను కమనీయంగా నిర్వహించారు. శ్రీ ఉ.వే. శ్రీమాన్ తి.న.చ. సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాలలో ఈసారి నూతన రథప్రతిష్ఠ, రథోత్సవ కార్యక్రమాలు నేత్రపర్వంగా జరిగాయి. భక్తుల భగవన్నామ స్మరణతో, ఫిబ్రవరి 6సాయంత్రం నుండి పిబ్రవరి 10వరకు విశేషంగా జరిగాయి. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శ్రీమాన్ శ్రీమతి రొండ్ల ఉర్మిళ తిరుపతి రెడ్డి గారు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## అక్కకొండ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు





## బీర్‌పూర్ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు








## సాటి లేని మహోత్సవం

# సమతా కుంభ్ -2025






అలనాడే కొలువైన దివ్య సాకేత రామ క్షేత్రం సన్నిధి ప్రదేశంలో, 108 దివ్య దేశ భగవాన్ మూర్తుల దేవాలయాలతో పరివృతమైన పవిత్ర క్షేత్రమందు మహోన్నత పద్మాసనంపై జగదాచార్యులు భగవద్రామానుజాచార్యుల విరాణ్మూర్తిని, అంతరాలయంలో స్వర్ణమూర్తిని ప్రతిష్ఠించి మూడు సంవత్సరాలు ముగిసింది. సదా సమాజ హితాన్ని సకల జనావళి సంక్షేమాన్ని ఆశించే వారు, సనాతన వేదధర్మ పరిరక్షకులు అపర రామానుజులుగా సంభావింపబడే వేద మార్గ ప్రతిష్ఠాపనాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి వారి పర్యవేక్షణలో ఈ క్షేత్రం ఆగమ శాస్త్రోక్త రీతిన వైభవంగా నిర్వహింపబడుతున్నది. వికాస తరంగిణి జెట్ విద్యాసంస్థలు జెట్ వరల్డ్, ఉపయవేదాంతపీఠం మొదలగు అనుబంధ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిత్యం వైదిక సంస్కృతి సంప్రదాయముల గొప్పతనాన్ని వ్యక్తీకరించేలా అద్భుతమైన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆధునిక జీవన విధానాలకు ప్రతిబంధకం కాకుండా ఆధ్యాత్మిక ఆచరణలను సమన్వయ పరుస్తూ కళలు విద్య సాంస్కృతిక ప్రదర్శనలకు ప్రోత్సాహం, వివిధ సామాజిక సేవా సంస్థల కార్యకలాపాలను సమన్వయీ కరించే నిర్వహణలో నిత్య నూతనంగా జరుగుతున్నాయి.

2025 ఫిబ్రవరి 10వ తేదీ నుండి సమతా కుంభ్ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కనీ విని ఎరగని రీతిలో ఏర్పాట్లతో, అలంకరణలతో, ప్రదర్శనలతో, ఆరాధనలతో నిర్వహించబడ్డాయి. సర్వాత్మనా భగవంతుడే సర్వవ్యాపకుడై ఉంటాడు. 'భగవంతుని శరీరమే విశ్వమంతా' అనే సత్యాన్ని నిరూపించి సత్యమైన ఈ వాస్తవ ప్రపంచంలో అందరూ సమానులే అని సమతా మూర్తిగా వెలసిన జగదాచార్యులు రామానుజాచార్యుల వారే విశ్వ గురువుగా భారతదేశాన్ని నిలబెట్టడానికి దిక్సూచి కావాలని భావిస్తూ శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించబడ్డాయి. ఆగమోక్త విధానంలో నిత్యం అంకురార్పణ, శాంతి కళ్యాణాల మొదలు అన్ని ఉత్సవాలు అద్భుతంగా జరిగాయి అసంఖ్యాక భక్తులు దేశ విదేశాల నుండి వచ్చి పాల్గొన్నారు ప్రధానంగా తెప్పోత్సవం ప్లవోత్సవం, వసంతోత్సవం అత్యంత వేడుకగా జరిగాయి. ఆధ్యాత్మిక నగరిగా విలసిల్లుతోంది సమతా మూర్తి క్షేత్రం. ★







# బాలవిజ్ఞానం

# అసలు శత్రువు

**శ్రీమతి విజయ కందాళ**

అనగా అనగా అనగా ఒక పెద్ద అడవి. ఆ అడవికి రాజు సింహం. ఆ సింహానికి నన్ను ఎదిరించే వాళ్ళు ఎవ్వరూ లేరు. నా అంత బలవంతులు కూడా ఈ అడవిలో ఎవరు లేరు. నేను చెప్పినట్టు అందరూ వినాలి. నేను చేసేదే సరియైన పని. అనే అహంకారంతో ఉండేది. అలా ఉండగా ఒక రోజు ఏం జరిగింది? ఆ అడవికి చివర పెద్ద చెరువు ఉంది. ఆ చెరువులో నీళ్లు తాగడానికి బయలుదేరింది.

సింహానికి బోలెడంత అహంకారం. తాను అడవికి రాజు కనుక ఎవ్వరికీ భయపడాల్సిన అవసరం లేదు అని అనుకునేది. వెళుతూ వెళుతూ ఒక చెదపురుగులు ఉన్న పుట్ట మీద కాలేసింది. పుట్టనిండా చెద పురుగులు. కాలు వేసేటప్పటికి పాపం అవన్నీటికి నొప్పి కలిగి అవన్నీ కూడా గట్టిగా "అయ్యో! మమ్మల్ని ఇలా తొక్కేసేస్తున్నావు. మా కాళ్లుచేతులు విరిగిపోతున్నాయి. కొంచెం కింద చూడు మేమందరం ఇక్కడ ఉన్నాము" అని అన్నాయి. అది విన్న సింహం చిన్న చిన్న పురుగులు మీరు అడవికి రాజునైన నన్ను ప్రశ్నిస్తారా? అని కోపంతో ఆ పుట్టని మొత్తం కాలితోటి తొక్కేసింది. చెదపురుగులకి చాలా నొప్పి వేసింది. సింహం ప్రవర్తనకు చాలా బాధపడ్డాయి కూడా. అడవికి రాజు అంటే అడవిలో ఉండే అన్ని ప్రాణులను సరిగా చూడాలి కదా! మనం ఇక్కడ బాధతోటి అరుస్తూ ఉంటే, మనల్ని తిట్టి కోప్పడి మన పుట్టనంత కూడా నేలమట్టం చేసేసి వెళ్ళిపోయింది. ఎంత హుందాగా ఉండాలి రాజు. ఎందుకు ఇలాగా నాశనం చేసావు మా పుట్టని అని గట్టిగా అరిచాయి. సింహానికి హేళనగా ఉఫ్ అంటే ఎగిరిపోతారు. అసలు మీరు ఎక్కడున్నారో కూడా నాకు కనిపించట్లేదు. నేను అడవికి రాజును నన్ను మీరు ప్రశ్నిస్తారా ఎంత ధైర్యం మిమ్మల్ని నలిపేస్తాను అని అరిచింది.

చెదపురుగులన్నీ పుట్ట నుంచి కొంచెం దూరంగా వెళ్ళిపోయి సింహం ప్రవర్తనను గురించి చర్చించుకున్నాయి. ఎలాగైనా సింహానికి మంచి గుణపాఠం నేర్పించాలి. మనం చిన్నవాళ్ళం అయితే ఏమి ! మనల్ని సింహము ఈ అడవిలోనే ప్రాణులతో సమానంగా చూడాలి కదా అనుకున్నాయి. అనుకుని అవన్నీ ఆలోచన చేసుకుని కనిపించిన చెట్లకి మొక్కలకి కూడా



చెదపురుగులు పట్టేసాయి. ఎక్కడ చూసినా చెదపురుగులే. ఇలా చెదలు పట్టేసిన ఆకులని, పళ్ళని, కొమ్మలని ఎవరు తింటారు. అడవిలో ఉండేటటువంటి జంతువులన్నీ కూడా ఇంకొక అడవికి వెళ్ళిపోయాయి. అప్పుడు సింహానికి అసలు ఆహారమే దొరకలేదు. ఆకలితోటి మాడిపోయింది. ఎంత ప్రయత్నం చేసినా ఎక్కడ చూసినా చెదల పుట్టలున్నటు వంటి చెట్లే తప్ప వేరే ప్రాణులు కనిపించలేదు. జంతువులు కనిపించలేదు. ఆకలితోటి సింహం అల్లాడిపోయింది.

అడవిలో ఆహారమే లేకుండా అయిపోయింది మృగరాజుకి. తన గుహను కూడా విడిచిపెట్టాల్సొచ్చేసింది. మరో మార్గం లేక ఇంకొక అడవిలోకి వెళ్ళిపోయింది. అలా వెళ్తూ వెళ్తూ చెద పురుగులజీవితాలతో నేను ఆటలాడాను. వాటిని చాలా బాధ పెట్టాను వాటికి నా వల్ల చాలా కష్టం కలిగింది. అలా నేను చేసి ఉండకపోతే నాకు అడవిలో ఆహారం దొరకక పోవడం అనే సమస్యనే ఉండేది కాదు. ఇలాంటి పరిస్థితికి నా అహంకారమే కారణం. ఇంకొకసారి నేను ఇలా ప్రవర్తించను అని తన మనసులో ఒక గట్టి నిశ్చయం చేసుకున్నది. అన్ని ప్రాణులను గౌరవించడం, మర్యాదగా మాట్లాడటం అనేది ఎవరైనా తప్పనిసరిగా నేర్చుకోవాల్సినలక్షణం. చిన్న ప్రాణే కదా అనుకుంటే సృష్టిలో అన్నిటికీ ప్రత్యేకత ఉంది అన్నీ ఉండాల్సినటువంటివే. మనమే ఉండాలి అనుకోవడం తప్పు. సింహం నేర్చుకున్న పాఠాన్ని మనము కూడా గుర్తుంచుకొని ఎప్పుడూ కూడా మనకంటే చిన్నవాళ్ళని తక్కువ స్థాయిలో ఉన్న వాళ్ళని గౌరవించడం నేర్చుకుందాము ★

**PRAPATTI SRISANNIDHANAM** Telugu Monthly **MAR 2025** **RNI NO : TELTEL/2024/89280**
**Publication Date 1st of Every Month, Posted at Karimnagar, DOP : Every month 5th / 6th**

## శ్రీసన్నిధి పదకేళి 13

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | | ■ | 4 |
| | ■ | | ■ | | ■ | ■ | 5 | |
| | ■ | | ■ | | ■ | 6 | ■ | |
| ■ | 7 | ■ | ■ | | ■ | | ■ | |
| 8 | | | | ■ | 9 | | ■ | |
| | ■ | ■ | ■ | ■ | ■ | | ■ | |
| 10 | | | | | | ■ | ■ | ■ |
| | ■ | ■ | ■ | ■ | ■ | ■ | 11 | ■ |
| | ■ | 12 | | | | | | |

### శ్రీమాన్ శ్రీ ఆచార్య శ్రీవత్స

**అడ్డం**

1.ఫిబ్రవరి సంచిక ముఖచిత్రంలో ఉన్న భగవానుడు(7), 5.ఆనందం, ఇష్టం(2) 8.భక్త రామదాసు సత్కృతికి ....వ్యాఖ్యాన సన్నుతి (4), 9.పూజా కార్యక్రమాల్లో చేతికి కట్టేది(2), 10.సరస్వతీదేవి జన్మించిన రోజు (6), 12.శ్రీరామయణంలో ఉపకథ (7).

**నిలువు**

1.పెద్దలు చెప్పేవి (3), 2.అర్చన చేయాలంటే ఇవి చదవాలి (3), 3. గొప్ప సన్యాసులను ఈ విధంగా కూడా అంటారు (4), 4. నంబి వారి శీర్షిక (6), 6.గృహం లో ద్వారముతో పాటు ఇది ఉండాలి (4), 7. మానవజాతి రాత్రిళ్ళు ఈ అవస్థలో ఉంటారు(2) 8.సాతులూరి వారి శీర్షిక (5), 11. షష్టి తిథి

శ్రీసన్నిధి పదకేళి 12 సమాధానాలు:

అడ్డం: 1.కౌసల్య, 3,తాపసి, 8.దయ, 9.విరులు, 10.గుహ, 13.మాలిని, 14,మారుతి, 18.తల్లి, 19.అజము, 20.సీత, 23.యశస్వి, 24.తాటకి.
నిలువు: 2.సతి, 4.పథం, 5.సుందర, 6.నరులు, 7.అహల్య, 11.మాలిని, 12.కరుణ, 15.మాత, 16.త్రిజట, 17.గౌతమి, 18.తల్లి, 21,ఆశ, 22.వేట

సరియైన సమాధానాలు పంపినవారు. కే.వి.యన్ రామకృష్ణ, వైజాగ్, జి.సువర్ణ, సిరిసిల్ల, మహేశ్వరి, ఇసిఐయల్, హైదరాబాద్.

**పదకేళిలో పాల్గొనండి! ఉచిత పత్రిక అందుకోండి!!**
సరియైన సమాధానాలు 9502583323 వాట్సప్ ద్వారా పంపండి.

## నూతన వధూవరులకు శుభాకాంక్షలు

శ్రీమాన్ పీతాంబరం వెంకట లక్ష్మణప్రవీణాచార్యులు, చి.ల.సౌ శ్రావణి లకు మీ దాంపత్యము చిరకాలం సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి.

భాగవతోత్తముల మరియు పెరుమాళ్ల మంగళాశాసనాలు ఎల్లప్పుడూ మీకు వుంటాయి.



From : **PRAPATTI SRISANNIDHANAM,**
Telugu Monthly,
H No 10-2-225, VIDYANAGAR, KARIMNAGAR -
Telangana - 505 001.

Printed & Edited and Published by DINGIRI SRINIVASA MURTHY on behalf of SRISANNIDHANAM CHARITABLE TRUST and Published at H.No 10-2-225, Vidhyanagar, Karimnagar, Telangana - 505 001
Editor DINGIRI SRINIVASA MURTHY, RNI No. TELTEL/2024/89280,
Cell No : 9502583323, Land line No 0878-2253323, Email Id prapatti.srisannidhanam9@gmail.com.